ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 07.05.2026 | సంపుటి : 12 సంచిక : 287 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## నామినేటెడ్ పోస్టులు భర్తీ

**17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్ల నియామకం**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. బ్రహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేశ్ నియమితులయ్యారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్‌గా గట్టు తిమ్మప్ప, మిగతా 2లో..

# మెట్రో రెండో దశకు ఆమోదం తెలపండి

**ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్ -3 కింద చేపట్టండి**

- కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి వినతి



న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంటపాటు భేటీ అయిన ఇరువురు నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మిగతా 2లో..

### నా కాన్వాయ్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికావొద్దు

డీజీపీ సీవీ ఆనంద్‌కు సీఎం రేవంత్ ఆదేశాలు

2 లో..

### 'కాళేశ్వరం'పై సమగ్రవివరాలు సమర్పించండి

అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

## ఇది నిజమా? ఏకమవుతున్న ద్రవిడ పార్టీలు!



**తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు డీఎంకే,ఏఐడీఎంకే సంసిద్ధత అంటూ ప్రచారం**



చెన్నై, మే 6 (జనంసాక్షి) : తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటులో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీవీకే పార్టీకి సంఖ్యాబలం తక్కువగా ఉండటంతో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ విముఖత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో డీఎంకే- అన్నాడీఎంకేల మధ్య పొత్తు చర్చలు నడుస్తున్నాయంటూ ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన నటుడు రాజకీయ నేత విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకోవడం ఉత్కంఠకు దారితీసింది. వామపక్ష పార్టీలు మద్దతు నిరాకరించడం, సంప్రదాయ ప్రత్యర్థులైన డీఎంకే-ఏడీఎంకేలు కలిసి వస్తున్నాయంటూ వస్తున్న వదంతులు, విజయ్ ప్రమాణస్వీకారం రద్దు వంటి పరిణామాలతో రాష్ట్ర రాజకీయం సంక్షోభంలో కూరుకుపోయింది. టీవీకేకి కీలక సమయంలో వామపక్ష పార్టీలు మద్దతు నిరాకరించడం రాజకీయంగా పెద్ద దెబ్బగా మారింది. సీపీఎం, సీపీఐ వంటి వామపక్ష సంఘటన పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయటి మద్దతు ఇవ్వడానికి నిరాకరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామం

### విజయ్ ప్రమాణ స్వీకారానికి ఎర్రజెండా

- మద్దతు నిరాకరించిన వామపక్షాలు
- రద్దైన నేటి ప్రమాణస్వీకారం

2 లో..

మ్యాజిక్ ఫిగరెక్కడ?

### విజయ్ సంఖ్యాబలంపై సంతృప్తి చెందని గవర్నర్

- టీవీకేకు తమిళ కాంగ్రెస్ మద్దతు
- ఆ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ ప్రకటన

టీవీకే సంఖ్యాబలాన్ని మ్యాజి క్ ఫిగర్ అయిన 118 సీట్ల కంటే చాలా దూరంలో నిలిపింది. సంకీర్ణ భాగస్వాముల కోసం విజయ్ శిబిరం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, మిగతా 2లో..



## బాధ్యతలు స్వీకరించిన భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి

**గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు. శివధర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు మిగతా 2లో..



# రైతు డిక్లరేషన్ ఏమైంది?

## అన్నదాతలను వంచించిన సీఎం రేవంత్, రాహుల్



- రైతు భరోసా రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు?
- రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైంది?
- బీఆర్ఎస్ హయాంలో ఠంఛనుగా రైతుభరోసా
- రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ విమర్శలు
- రైతులు ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడవద్దని వినతి

వరంగల్ బ్యూరో(జనంసాక్షి): రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కి దున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు మిగతా 2లో..



# ప్రతీ గింజను కొంటున్నాం

**రాద్ధాంతాలు ఆపండి**

- రైతుల్లో అయోమయం కలిగించేలా బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం సరికాదు
- 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటికే 17.28 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేయడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు అంశంపై ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తూ, రైతులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తోందని, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ రబీలో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో భాగంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం 2.63 లక్షల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) నుంచి ధాన్యాన్ని, రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులు మిగతా 2లో..

## రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు
- ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఓర్వలేకే ఓర్వలేకే కేటీఆర్ విషం చిమ్ముతున్నారు : మంత్రి సీతక్క ఆగ్రహం



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాజకీయాల్లో మరోసారి భాషా యుద్ధం తారాస్థాయికి చేరింది. వరంగల్ వేదికగా జరిగిన రైతు సంగ్రామ సదస్సు లో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కేటీఆర్ తన సంస్కారాన్ని మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మీ పదేళ్ల పాలనలో రైతులు ఎన్ని కష్టాలు పడ్డారో ఆత్మవిమర్శ చేసుకోవాలి అని హితవు పలికారు. కేటీఆర్ భాషను చూస్తుంటే ఆయనకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని అర్థమవుతోందని, బూతులు తిడితే నాయకుడు కాలేరని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు.మంత్రి సీతక్క సైతం కేటీఆర్ వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ చదువుకున్న వారు, కొంత మంచి పేరున్న వారు.. ఇలాంటి వెకిలి వ్యాఖ్యలు చేసి జోకర్ కావద్దు అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేస్తుంటే, ఓర్వలేక విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కేటీఆర్‌కు అధికారం పోయిందని పిచ్చి పట్టింది, మిగతా 2లో..



## బెంగాల్‌లో చెలరేగుతున్న హింస

- టీఎంసీ కార్యాలయం బుల్డోజర్‌తో కూల్చివేత
- ఒక వర్గానికి చెందిన దుకాణాలను తగులబెట్టిన అల్లరి మూకలు

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు రాజకీయ దుమారానికి దారితీశాయి. ఫలితాలు వెలువడిన తర్వాత పలుచోట్ల భాజపా, టీఎంసీ వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి కోల్‌కతాలోని తృణమూల్ పార్టీ కార్యాలయం పైకి బుల్డోజర్ వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అర్ధరాత్రి సమయంలో టీఎంసీ యూనియన్ ఆఫీసు వద్దకు వచ్చిన కొందరు వ్యక్తులు.. కార్యాలయాన్ని కూల్చేశారు. అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్నట్టుండి ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానిక దుకాణదారులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే తమ మిగతా 2లో..

# రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకే

- పట్టా లేకుండా కేవలం పహాణీలు, ఫసల్ పట్టీల ఆధారంగా యాజమాన్య హక్కులు రావు
- భూ వివాదంలో సుప్రీం కీలక తీర్పు
- హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థించిన ధర్మాసనం



న్యూఢిల్లీ(జనంసాక్షి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూముల వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకేనని, అవి యాజమాన్య హక్కులు కల్పించవని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం కాల్వలనాగారం భూములపై జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం బుధవారం తుది తీర్పు ఇచ్చింది. ఇదే వ్యవహారంపై గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది.సర్వే నంబరు 81లో 600 ఎకరాల భూమిని అటవీ భూమిగా గుర్తిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. పట్టా లేకుండా కేవలం పహాణీలు, ఫసల్ పట్టీల ఆధారంగా యాజమాన్య హక్కులు రావని పేర్కొంది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల అవసరాల కోసమేనని వెల్లడించింది. అప్పీలుదారు తమ క్లెయిమ్‌ను నిరూపించే అసలు డాక్యుమెంట్లు సమర్పించలేదని పేర్కొన్న ధర్మాసనం.. మిగతా 2లో..

### సీఈసీ నియామకంలో సీజే తొలగింపు కేసు.. విచారణ వాయిదా కుదరదు

కేంద్రానికి స్పష్టం చేసిన సుప్రీం వార్త 2లో

# ఇరాన్ అంగీకరించకపోతే.. దాడులు మరింత తీవ్రం

- మాతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ 'ఎపిక్ ఫ్యూరీ' ముగిసిపోతుంది
- దీంతో ఇరాన్ సహా అందరికీ హర్మూజ్ జలసంధి తెరుచుకుంటుంది
- లేనిపక్షంలో మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయి: ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్(జనంసాక్షి):ఒకవేళ ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆపరేషన్ 'ఎపిక్ ఫ్యూరీ' ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ క్రమంలో ఇరాన్ సహా అందరికీ హర్మూజ్ జలసంధి తెరుచుకుంటుందని చెప్పారు. లేనిపక్షంలో మళ్లీ బాంబు దాడులు మొదలవుతాయని హెచ్చరించారు. అవి మునుపటి కంటే భీకర స్థాయిలో, మరింత తీవ్రతతో ఉంటాయని 'ట్రూత్ సోషల్' వేదికగా పేర్కొన్నారు. యుద్ధం ముగింపు మిగతా 2లో..

### రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న పంపిణీ

బహిరంగ మార్కెట్‌లో వేలానికి ఇక స్వస్తి

9 లో..



### చేప ప్రసాదం పంపిణీ జూన్ 8న

బత్తిన కుటుంబ సభ్యుల ప్రకటన

## ప్రతీ గింజను కొంటున్నాం

ఎవరూ ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని మంత్రి ఉత్తమ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలి అనేది కూడా అధికారులకు సూచనలు చేశామని అన్నారు. ప్రతి కొనుగోలు సెంటర్లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై భవన్ లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి రోజు వెదర్ అలర్ట్ అన్ని కొనుగోలు సెంటర్లకు అందిస్తున్నామని..తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ఎక్కువ కొనుగోలు సెంటర్ల ను ఏర్పాటు చేశామని... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కంటే కాంగ్రెస్ హయంలో ఎక్కువ మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఏ రైతుకు ఇబ్బంది వచ్చిన కంట్రోల్ సెంటర్ కు పిర్యాదు చేయొచ్చని అన్నారు. కేటీఆర్ ధాన్యం కొనుగోలు విషయంలో అవగాహన రహితంగా మాట్లాడుతున్నారని.. బీఆర్ఎస్ కు ఇప్పటికే ప్రజలు బొంద పెట్టారని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

అందుకే బూతులు మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీ వంటి నాయకుడిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు అని సీతక్క స్పష్టం చేశారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టడం రాజ్యాంగబద్ధమైన హక్కు. కానీ, ఆ నిరసనను వ్యక్తులపై బూతులతో చేయడం వల్ల అసలు సమస్య పక్కదారి పడుతోంది. వరంగల్ సభలో రైతుల రుణమాఫీ, బోనస్ వంటి అంశాలపై క్షేత్రస్థాయి ఆధారాలతో కేటీఆర్ మాట్లాడి ఉంటే ప్రభుత్వానికి ఇబ్బంది కలిగేదని.. కానీ, ఆయన వాడిన భాష వల్ల ఇప్పుడు చర్చంతా కేటీఆర్ సంస్కారం చుట్టూనే తిరుగుతోందని అంటున్నారు. ఫ్రస్ట్రేషన్ తో తిడితే ప్రజల్లో సానుభూతి రాదని, అది కేవలం రాజకీయ రచ్చకు మాత్రమే దారితీస్తుందని అంటున్నారు.

## రైతు డిక్లరేషన్ ఏమైంది?

పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు.

రైతులు ధైర్యం కోల్పోవద్దు..

రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు.

## నేడు బీహార్ కేబినేట్ విస్తరణ

### మంత్రివర్గంలో నితీశ్ తనయుడు నిశాంత్

**పాట్నా(జనంసాక్షి):**బీహార్‌లో ఈనెల 7న గురువారం కీలక మంత్రివర్గ విస్తరణ జరుగనుంది. గాంధీ మైదానంలో పెద్దఎత్తున ప్రమాణస్వీకార కార్యాక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. జేడీయూ నేతలు మంగళవారం రాత్రి జరిపిన సమావేశంలో ప్రభుత్వంలో చేరాలని నిశాంత్‌ను ఒప్పించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి పాట్నా వచ్చిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా, జేడీయూ నేతలు ప్రస్తుతం 7 సర్క్యులర్ రోడ్డులోని నితీశ్ కుమార్ నివాసంలో సమావేశం జరిపారు. ఈ సమావేశంలో మంత్రుల తుది జాబితాను ఆమోదించనున్నట్టు తెలుస్తోంది. చాలాకాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న నిశాంత్ ప్రభుత్వంలో చేరేందుకు కూడా తొలుత నిరాకరించారు. అయితే మంగళవారంనాడు జరిగిన జేడీయూ సమావేశంలో సీనియర్ నేతలు ఆయనను ప్రభుత్వంలో చేరేందుకు ఒప్పించినట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆయన చేరడం పార్టీకి, రాష్ట్రానికి కూడా కీలకమని నచ్చచెప్పినట్టు సమాచారం. నిశాంత్ ప్రస్తుతం ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు, నితీశ్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల ఫీడ్‌బ్యాక్‌ను సేకరించేందుకు పలు జిల్లాల్లో 'బిహార్ గుడ్‌విల్ యాత్ర' జరుపుతున్నారు. ఆయన గత మే 8న లాంఛనంగా జేడీయూలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ఆయనకు సభ్యత్వాన్ని అందజేశారు. కాగా, బిహార్ మంత్రివర్గ విస్తరణలో 27 మందికి చేటు కల్పించనున్నారు. బీజేపీ నుంచి 12 మంది, జేడీయూ నుంచి 11 మంది, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నుంచి ఇద్దరు, హెచ్‌ఏఎం, ఆర్‌ఎల్‌ఎస్‌పీ నుంచి చెరొకరికి మంత్రివర్గంలో చోటు కల్పించనున్నారు.

# మెట్రో రెండో దశకు ఆమోదం తెలపండి

మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నట్టు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని, శంషా బాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టాలని కోరారు. ఏడు కారి డార్లతో కూడిన మెట్రో ఫేజ్-2సమగ్ర ప్రణా ళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమ ర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశా రు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబా ద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెం దుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరిం చాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం ? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-ఎఎఎ కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్య మంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్‌ఎం ఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నా కాన్వాయ్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికావొద్దు

### డీజీపీ సీవీ ఆనంద్‌కు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): తన కాన్వాయ్ కారణంగా సామాన్యులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు డీజీపీ సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.



## 'కాళేశ్వరం'పై సమగ్ర వివరాలు సమర్పించండి

– అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):అక్కడో పని ఇక్కడో పని చేపట్టడం కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో చేపట్టిన అన్ని ప్యాకేజీల వివరాలను సమగ్రంగా తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు టీఎంసీ పనులతో సహా అన్నింటిలోనూ భూసేకరణ, జరిగిన పని, చేయాల్సిన పని ఇలా అన్ని వివరాలు ఉండాలని సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నుంచి ఉమ్మడి నిజామాబాద్‌కు నీటిని మళ్లించే 21, 22 ప్యాకేజీల పనుల గురించి ఇటీవల సీఎం సమీక్షించారు .మాసాని, మంచిప్ప చెరువుల సామర్థ్యం పెంచడానికి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు, మళ్లీ రద్దు చేయడం, కొత్తగా ఐదు టీఎంసీలతో చెరువుల కెపాసిటీని పెంచి నీటిని సప్లై చేయడం తదితర ప్రతిపాదనలపై సమీక్షలో చర్చకు వచ్చాయి. 0.2 టీఎంసీ సామర్థ్యం గల చెరువు నుంచి ఐదు టీఎంసీల నీటిని ఎలా ఇవ్వగలరని, పనులు చేపట్టడం, తర్వాత సమస్యలు రావడం కాకుండా అన్ని అంశాల ను సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## బెంగాల్‌లో చెలరేగుతున్న హింస

దుకాణాలు మూసేసి అక్కడినుంచి పారిపోయారు. ఈ ఘటనలో టీఎంసీ కార్యాలయం పూర్తిగా ధ్వంసం కావడం గమనార్హం. బుల్డోజర్ తీసుకొచ్చిన వారి చేతుల్లో భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ జెండాలు కన్పించడం చర్చనీయాంశమైంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కూల్చివేత దృశ్యాలను టీఎంసీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. "భాజపా పరివర్తన్ మొదలైంది. ఈ మార్పు బుల్డోజర్‌తో వచ్చింది. భాజపా కార్యకర్తలు వీధుల్లోకి వెళ్లి దాడులకు పాల్పడేందుకు ఆ పార్టీ అధిష్టానం వారికి లైసెన్స్ ఇచ్చినట్లు ఉంది. ఈ రోజు దుకా ణాలు, ఆఫీసులను కూలుస్తున్నారు. రేపు రాజకీయ ప్రత్యర్థులనూ వదిలిపెట్టరేమో..!" అని టీఎంసీ మండిపడింది కోల్‌కతాతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఘర్షణలు చెలరేగాయి. బిజోయ్ గఢ్‌లో తృణమూల్ అభ్యర్థికి చెందిన కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఆర్‌జీకర్ హత్యాచార బాధితురాలి తల్లి గెలిచిన పానిహ టీలో తృణమూల్ కార్యాలయాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక ఆదేశా లు జారీ చేశారు. అదనపు భద్రతను మోహరించాలని పేర్కొన్నారు.

## తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

యాదవ కార్పొరేషన్ చైర్మన్: రఘునాథ్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్: గుంజా రేణుక హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్: దూదెం వెంకట రమణ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్: చరణ్ కౌశిక్,తెలుగు అకాడమీ చైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ, వాషర్ మెన్ - డాక్టర్ అజయ్ కుమార్ గీత కార్మిక - చంద్ర శేఖర్ గౌడ్,పెరిక - గొంగరి వెంకటేశర్లు,మేర - సంగ వెంకట్ రాజం,మున్నూరు కాపు - బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,పద్మశాలి - గూడూరి శ్రీనివాస్,వెలమ - జువ్వాడి నర్సింగ్ రావు ఉన్నారు.

## రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకే..

దశాబ్దాల కాలంగా సాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ తీర్పు ఇచ్చింది. దీంతో 1950 నాటి నిజాం కాలపు ఫారెస్ట్ గెజిట్ నోటిఫికేషన్‌ను సవాల్ చేసిన అప్పీలుదారులకు చుక్కెదురైంది.

## బాధ్యతలు స్వీకరించిన భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి

జారీ చేసిన విషయం తెలిసిందే.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపీఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన స్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్సర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి సుమతి, ఐ జి పి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ, పోలీసు విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై ప్రభుత్వం మౌనం సరికాదు

### రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత



హైదరాబాద్(జనంసాక్షి): ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమాన త్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'న్యాయమైన విద్య - ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధి చినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయ కులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

### సీఈసీ నియామకంలో సీజే తొలగింపు కేసు..

## విచారణ వాయిదా కుదరదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వాన్ని తొలగించిన కేసుపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. కాగా ఈ అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున ఈ కేసును కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని కేంద్రం తరపు వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు. కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరిస్తూ..ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని.. ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేశారు.

# ఏకమవుతున్న ద్రవిడ పార్టీలు!

ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదని సమాచారం.

**డీఎంకే-ఏడీఎంకే కలిసే అవకాశం..?**

అత్యంత ఆశ్చర్యకరంగా, దశాబ్దాలుగా తీవ్ర శత్రువులుగా ఉన్న ద్రవిడ మజ్లిస్ మున్నేట్ర కళగం (డీఎంకే), అన్నా ద్రవిడ మజ్లిస్ మున్నేట్ర కళగం (ఏడీఎంకే) ఒకే వేదికపైకి వస్తున్నాయని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. విజయ్‌ను అధికారానికి దూరంగా ఉంచేందుకు ఈ రెండు ద్రవిడ పార్టీలు కలిసి ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. తమ మధ్య ఉన్న సైద్ధాంతిక భేదాలను పక్కన పెట్టి "ఉమ్మడి శత్రువు"ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్చలు జరుగుతున్నాయని సమాచారం. అయితే ఈ విషయమై ఏ పార్టీ నేతలూ అధికారికంగా స్పందించలేదు. డీఎంకే ఖాతాలో 59, అన్నాడీఎంకే ఖాతాలో 47 ఉన్నాయి.. అయితే.. బీజేపీ, కాంగ్రెస్ కాకుండా రెండు పార్టీల మిత్రపక్షాలు కలిస్తే సభ్యుల సంఖ్య 120కి చేరనుంది. విజయ్ ఇప్పటికీ మెజార్టీ నెంబర్ చూపించకపోవడంతో ద్రవిడ పార్టీలు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం..

**సంకీర్ణానికి సై కొడతారా?**

'విజయ్ సినీ పరిశ్రమ నుంచి రాజకీయాలకు వచ్చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఓట్లేశారు. కానీ ఈ రాజకీయ మేనేజ్‌మెంట్ ఆయనకు కొత్త సవాలు. తమిళనాడు రాజకీయాల్లో సంకీర్ణ ధర్మం చాలా క్లిష్టంగా ఉంటుంది' అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంక్షోభం ఎంత వేగంగా పరిష్కారమవుతుందనేది రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని చెబుతున్నారు. తమిళనాట రాజకీయ పరిణామాలు గంటకు గంటకు మారుతున్న నేపథ్యంలో పరిస్థితి పూర్తిగా అనిశ్చితంగా ఉంది. రాష్ట్రపతి పాలన విధింపు నుంచి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు వరకు అన్ని అవకాశాలూ పరిశీలనలో ఉన్నాయని పలువర్గాల నుంచి సమాచారం.



## విజయ్ సంఖ్యాబలంపై సంతృప్తి చెందని గవర్నర్

చెన్నై(జనంసాక్షి): టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది.

**టివికెకు తమిళ కాంగ్రెస్ మద్దతు**

తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీవీకే పార్టీకి కాంగ్రెస్ అధికారిక మద్దతు ప్రకటించింది. బేషరతుగానే ఈ మద్దుతును తెలిపింది. విజయ్ కోరకముందే కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడ అన్నడిఎంకెను కలుపుకుం టారో అన్న భయం కాంగ్రెస్‌లో ఉంది. అందుకే విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతు తెలుపుతూ ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు.

## విజయ్ ప్రమాణ స్వీకరానికి ఎర్రజెండా

చెన్నై(జనంసాక్షి):విజయ్ టీవీకే పార్టీకి తాము మద్దతివ్వబోమని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), లెఫ్ట్ పార్టీలు తేల్చి చెప్పాయి. తాము డీఎంకే కూటమిలోనే ఉంటామని పేర్కొన్నాయి. ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో విజయ్ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కార్యక్రమం రద్దయినట్లు తెలుస్తోంది. రాజ్‌భవన్ స్థాయిలో జరిగిన పరిణామాలు, అవసరమైన సంఖ్యాబలం నిరూపించుకో లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ రద్దు పరిణామం టీవీకే శ్రేణుల్లో ఆందోళన కలిగించింది. తమిళనాడులో అధికారం చేజిక్కించుకునే విషయంలో "హార్స్ ట్రేడిం గ్" భయాలతో టీవీకే గెలుపొందిన ఎమ్మెల్యేలను రిసా ర్టులలో ఉంచినట్లు సమాచారం. తమ ఎమ్మెల్యేలను ప్రత్యర్థి శిబిరాలు మేనేజ్ చేయకుండా నిరోధించేందుకు ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. కర్ణాటక, మహారాష్ట్ర రాజకీయాల్లో జరిగిన రిసార్ట్ రాజకీయాలు తమిళనాట పునరావృతమవుతున్నాయని విమర్శకులు అంటున్నారు. మరోవైపు డీఎంకే మిత్రపక్షమైన వీసీకే.. టీవీకే పార్టీకి మద్దతిచ్చే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తమిళనాడులో సీపీఐకి 2, సీపీఎంకి 2, ఐయూ ఎంఎల్‌కు 2, వీసీకేకు 2 సీట్లు ఉన్నాయి.

## ఇరాన్ అంగీకరించకపోతే.. దాడులు మరింత తీవ్రం

దిశగా ఓ ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.యుద్ధాన్ని ముగించేందుకు, మరింత వివరణాత్మక అణు చర్చల కోసం ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు అమెరికా, ఇరాన్‌లు ఓ ఒప్పందానికి చేరువవుతున్నాయని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ.. ఓ అమెరికా మీడియా సంస్థ పేర్కొంది. అణు కార్యక్రమాల తాత్కాలిక నిషేధానికి ఇరాన్ ముందుకు రావడం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు ఎత్తేయడం, ఇరాన్‌కు చెందిన నిధుల విడుదలకు అమెరికా అంగీకరించడం వంటివి ఈ ఒప్పందంలో ఉన్నాయని తెలిపింది.

హర్మూజ్‌లో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు బ్రేక్..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రారంభించిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు బ్రేక్ పడింది. ఇరాన్‌తో దౌత్య చర్చల్లో పురోగతి నేపథ్యంలో.. దీన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. పాకిస్థాన్ ఇతర దేశాల అభ్యర్థన మేరకు, ఇరాన్‌పై సాధించిన విజయాన్ని దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో ఇరాన్ (ఎతీజీని) ప్రతినిధులతో ఒక సంపూర్ణ, తుది ఒప్పందం దిశగా కొనసాగుతోన్న ప్రయత్నాల్లో పురోగతి సాధించామన్నారు. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టంచేశారు. ఒప్పందంపై పూర్తి స్పష్టత వచ్చేంతవరకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇక, ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్ బహిరంగ ప్రకటనలకు విరుద్ధంగా తమతో ఒక ఒప్పందం చేసుకునేందుకు రహస్యంగా ప్రయత్నిస్తోందని ట్రంప్ అన్నారు. ఈసందర్భంగా ఇరాన్ లొంగిపోవాలని ఆయన హెచ్చరించారు. తాము పూర్తిస్థాయిలో పోరాటానికి దిగితే.. వారు దాన్ని ఆపలేరని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో విదేశీ నౌకలను జలసంధి నుంచి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్దేశంతో ట్రంప్ ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ప్రకటించారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

### సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు

కోల్‌కతా:పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య తెలిపారు.

# కుకింగ్ గ్యాస్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

### కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కుకింగ్ గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరి చందన హామీ ఇచ్చారు. బుధవారం నాడు తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు కమిటీ చైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు ,కమిటీ నాయకులు చామకూర రాజు, అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శులు అజయ్ రెడ్డి ,నగేష్ గౌడ్,గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు కలిసి సెక్రటేరియట్ లో ఎల్.పీ.జీ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు కార్మిక శాఖ కార్యదర్శి హరిచందన ద్రుష్టి కి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా గౌరవ సలహా దారు కమిటీ చైర్మన్ టి.చిరంజీవులు మాట్లాడుతూ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. ఈ ఎస్ఐ ,పిఎఫ్ లు ఇవ్వడం లేదంటూ పలు అంశాలు కార్యదర్శి హరిచందన దృష్టికి తీసుకెళ్లారు .ఈ సందర్భంగా కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు కార్మిక శాఖ తరపున నోటీసులు పంపిస్తామని డిస్ట్రిబ్యూటర్లతో డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖనియమాలను పాటించ కుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడెంటిటీ కార్డులు అపాయింట్మెంట్ లెటర్ కూడా కనీసం ఇవ్వడం లేదని ఆయన కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖలను నియమాలను పాటించకుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వివిధమైన ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారని వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదని ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ అధికారిని దృష్టికి తీసుకెళ్లారు.

# మైనార్టీలకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ

### మే 31 తేదీ లోపు దరఖాస్తుల స్వీకరణ

### రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** యూపీఎస్సీ 2027 లో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థుల కోసం తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ వారు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు కలిగి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి 3 ఏండ్ల డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ యొక్కశిక్షణ పొందటానికి అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను **https://cet.cgg.gov.in/tmreis** వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు జూన్ 14 న రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాలలోని సమీప మైనారిటీ గరుకులాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబడతుందని, ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన 100 మందిని ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించటం జరుగుతుందని ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్శి మతాలకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కొరకు 8520860785 నంబర్ నందు సంప్రదించాలని సూచించారు.

# పురాతన కాకతీయ కట్టడం కూల్చివేత

### ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పరిశీలన



**నర్సంపేట, మే 6 (జనంసాక్షి) :** నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని ఖానాపూర్ మండలం అశోక్ నగర్‌లో, సైనిక్ పాఠశాల సమీపంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థల కేటాయింపులో భాగంగా తట్టి స్థలంలో ఉన్న పురాతన కాకతీయుల కాలం నాటి కట్టడాన్ని కూల్చివేసినట్లు వచ్చిన వార్తలపై స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి చెట్ల పొదలు చదను చేస్తున్న క్రమంలో వెలుగులోకి వచ్చింది. అట్టి పురాతన కట్టడానికి పునర్నిమాణం చేపట్టుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పురాతన కట్టడం పురావస్తు శాఖ పరిధిలో నమోదు కాలేదని తెలిపారు. అది కాకతీయుల కాలానికి చెందిన నిర్మాణంగా భావిస్తున్నందున, పురాతన వారసత్వ సంపదను పరిరక్షించేందుకు ఈస్ట్రోరియన్స్, పురావస్తు శాఖ సమన్వయంతో తగు చర్యలు చేపడతామని తెలిజేశారు. ఈ పరిశీలనలో నర్సంపేట ఆర్డీవో ఉమా దేవి, ఖానాపూర్ తాసిల్దార్ రమేష్, ఆర్కియాలజీ అధికారులు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఇంజనీరింగ్ వారు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# రైతులను ముంచి ఇప్పుడు మొసలి కన్నీరు

- కేసీఆర్ హయాంలో 7వేలమంది రైతుల మరణం
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్యే నాయిని

**హనుమకొండ, మే6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఖండించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉన్నాయని ఎద్దేవా చేశారు. బుధవారం జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుపై నాయిని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక నకిలీ విత్తనాలు అమ్మే ముఠా అని, వారి హయాంలో 7 వేల మంది రైతులు మరణించారని ఆయన గుర్తుచేశారు. రైతులపై ఎఫ్ఐఆర్ చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, రైతులను నట్టేట ముంచిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్‌ను అడ్డంపెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ మాట్లాడుతూ' స్క్రిప్ట్ రాసిస్తే చదవడం కాదు, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలి. రాహూల్ గాంధీని విమర్శించే స్థాయా నీది?. ఒకప్పుడు మీ కుటుంబం సోనియా గాంధీ చుట్టూ తిరిగారు. కేటీఆర్ వెంట ఉన్న వాళ్లంతా దోపిడీదారులే.. నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి హనుమకొండ చౌరస్తాకు వస్తావా? రైతులను నట్టేట ముంచింది బీఆర్ఎస్. నా ప్రశ్నలకు కాదు, ముందు నీ చెల్లెలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వు' అని అన్నారు.

# నిరుద్యోగులకు వయోపరిమితి 10 ఏళ్లకు పెంచండి

### ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు వేర్వేరుగా వినతులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం త్వరలోనే తీపి కబురు అందించే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇచ్చే నోటిఫికేషన్లలో వయోపరిమితిని మరో 10 ఏళ్ల పాటు సడలించాలని పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ లు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను వేర్వురుగా కలిసి వినతిపత్రం అందజేశారు.

తెలంగాణ ఉద్యమ కాలంలో పదేళ్ల పాటు ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల కాలేదని, స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం కూడా పదేళ్ల కాలంలో ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సుదీర్ఘ 20 ఏళ్ల కాలంలో సరైన నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయి, అర్హత కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతి అని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు నష్టపోకుండా ఉండాలంటే భవిష్యత్తులో విడుదలయ్యే అన్ని నోటిఫికేషన్లలో వయోపరిమితిని పెంచాలని కోరారు. తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి పొందే అవకాశం లభిస్తుందని వారు వివరించారు.

ఈ విన్నపంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నిరుద్యోగులకు సంబంధించిన ఈ సమస్య గురించి వారితో లోతుగా చర్చించారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం వయోపరిమితి సడలింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.

# కొండాయి వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ఏటూరునాగారం, మే 06(జనంసాక్షి) :** కొండాయి వంతెన నిర్మాణ పనులలో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏటూరునాగారం మండలం 16.50 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న కొండాయి వంతెన నిర్మాణ పనుల పురోగతిని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొండాయి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వం 16.50 కోట్ల రూపాయల నిధులతో వంతెన నిర్మిస్తుందని తెలిపారు. యుద్ధ ప్రతిపాదికన వంతెన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. జూన్ - జూలై నాటికి ప్రజలకు వంతెన అందుబాటులో ఉండే విధంగా చూడాలని, వరద ప్రవాహం గ్రామం లోకి పోటెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండాయి గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# మక్కులు కొని రైతులను ఆదుకోండి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


**జగిత్యాల, మే 6 (జనంసాక్షి) :** 'మీకు పాదాభివందనం చేస్తాం. దయచేసి మక్కలు కొనండి' అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అధికారులను వేడుకున్నారు. కొన్ని రోజులుగా కల్లాల్లోనే మక్కలు పేరుకుపోవడం, వర్షాలకు తడిసి ముద్దవుతుండంతో ఆయన మక్కజొన్న కొనుగోలు చేయాలని మార్క్ ఫెడ్ డీఎంకు ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సంజయ్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# నకిలీ సంఘాలపై 'మా' వార్నింగ్!

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని నటీనటుల సంక్షేమం కోసం పని చేసే ఏకైక అధికారిక సంస్థ 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) మాత్రమేనని, రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి ఇదొక్కటే గుర్తింపు పొందిన సంఘమని అసోసియేషన్ ఒక అధికారిక ప్రకటనలో తాజాగా వెల్లడించింది. ఇటీవల కొంతమంది వ్యక్తులు, అనధికారిక బృందాలు ఏపీ మా , మా ఏపీ వంటి తప్పుదోవ పట్టించే పేర్లతో నటీనటులను, ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మా కార్యవర్గం వెల్లడించింది. ముఖ్యంగా ఇలాంటి నకిలీ సంఘాల పేరుతో కళాకారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం అందడంతో 'మా' తీవ్రంగా స్పందించింది.

# రాయపోల్‌లో గాలివాన బీభత్సం

- విద్యుత్ పునరుద్ధరణకు గ్రామస్థుల డిమాండ్



**సిద్దిపేట, మే6 (జనంసాక్షి) :** గాలి వాన బీభత్సం సృష్టించడంతో జన జనజీవనం అతల కుతలమైంది. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించడంతో చేతికి వచ్చిన వరి పంట నేల వాలింది. విద్యుత్ స్తంభాలు గాలివానకు కుప్పకూలాయి. రాత్రి నుంచి ఇప్పటివరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాలు అంధకారం లో ఉన్నాయి. భారీ గాలివాన రావడంతో కొత్తపల్లి,టేంకంపేట, రాంసాగర్ గ్రామాలకు వెళ్లే రహదారిపై భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 11కేవి విద్యుత్తు స్తంభాలు గాలివానకు కిందపడి పోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో గాలివానకు రేకుల షెడ్లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. వందల ఎకరాల్లో వరి పంట చేతికి వచ్చిన సమయంలో నేలరాడంతో రైతులకు నష్టం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ విద్యుత్ పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. కొత్తపల్లి సర్పంచ్ శ్యామల ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో రోడ్డుపై ఉన్న భారీ వృక్షాలను తొలగించి రాకపోకలను సరి చేశారు. పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించడంతో మండల వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# పరదాలు కప్పడానికి వెళితే ప్రాణాలు పోయాయి

- గోడ కూలి నలుగురు రైతుల మృతి
- రైతుల కుటుంబాల్లో విషాదం
- ధర్నాలు, రాస్తారోకోలు





**మంచిర్యాల ప్రతినిధి, మే 6 (జనంసాక్షి) :** ఆరుగాలం కష్టించి పండించిన పంట అర్ధరాత్రి అకాల వర్షం ఈదురు గాలులతో రావడంతో ఎక్కడ తడిసిపోతుందో అని రైతులు కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు తడవకుండా ఉండడానికి పరదాలు కప్పడానికి వెల్లిన ఘటనలో గోడకూలి నలుగురు రైతులు మరణించడం రైతు కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో అకాల వర్షం బీభత్సాన్ని సృష్టించింది. భారీ ఈదురుగాలులతో మండలంలో పలు చెట్లు కూడా పంటలు నేలమట్టమయ్యాయి. భారీగా వచ్చిన ఈదురు గాలులు అకాల వర్షంతో తమ పంటలు తడిసి ముద్ద అవుతాయని కొనుగోలు కేంద్రాల్లో కల్లల్లో అమ్మడానికి సిద్ధంగా ఉన్న వడ్లను తడవకుండా ఉంచడానికి అర్ధరాత్రి రైతులు తమ పంటపై టార్పాలిన్ కప్పి తమ పంటను కాపాడుకోవడానికి వెళ్లి తార్పాలిన్లు కప్పిన తర్వాత తమ తడవకుండా ఉండడానికి పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లగా భారీ ఈదురు గాలులకు ఒక్కసారిగా రేకుల షెడ్డు గోడ కూలిపోవడంతో అందులో వర్షం ఉండి తలదాచుకుంటున్న నలుగురు రైతులపై పడడంతో తీవ్ర గాయాలు అయినవి అక్కడే ఇద్దరూ మృత్యువాత పడగా మరో ఇద్దరిని ఆసుపత్రి తరలించారు. గోడ కూలడంతో దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన నిర్మిలచ్చన్న (55) , గుండారపు వెంకటేశ్ (24) అనే రైతు అక్కడికక్కడే మృతి.. మరో ఐదుగురు రైతులకు తీవ్రగాయాలు అయినవి .క్షతగాత్రులను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .మిగతా రైతుల పరిస్థితి విషమించడంతో తనుగుల నాగరాజు, సీదుల హరీష్ ఇద్దరు రైతులను కరీంనగర్ కు తరలించారు. అలాగే ఇదే ఘటన లాగా గంపలపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రేకుల షెడ్డు కూలి తనుగుల అభిరాం (22) అనే యువ రైతు మృతి మృతి చెందాడు .మరో రైతు తనుగుల నాగరాజు 42 తీవ్ర గాయాలుగా అతనిని కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు .మంచిర్యాల జిల్లాలో జరిగిన ఘటనలో నలుగురు రైతులు మృత్యువాత పడగా మరో ముగ్గురు రైతులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు . ప్రభుత్వాలు సకాలంలో వడ్లను కొనుగోలు చేసినట్లయితే ఈ రైతులు మృతి చెంది వారు కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు .ప్రతి సంవత్సరం పంట చేతికి వచ్చిన తర్వాత నెలల తరబడి దాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమపంటను కాపాడుకోవాల్సి వస్తుందని సకాలంలో కొనుగోలు కేంద్రాలు తమ వడ్లను తీసుకున్నట్లయితే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . రైతులు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

### రైతుల మృతికి నిరసనగా బిఆర్ఎస్ రాస్తారోకో

జిల్లాలోని గంపలపల్లి, కొత్తూరులో అకస్మిక వర్షానికి ఈదురు గాలులు రావడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లపై తార్పాలిన్ కవర్లు కప్పడానికి వెళ్లి పక్కనే ఉన్న వర్షంలో తడవకుండా షెడ్డులోకి వెళ్లడంతో షెడ్డు గోడ కూలి నలుగురు రైతులు మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులతో టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు విజిత్ రావు లు పట్టణంలోని ఉత్కూరు చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ...వడ్లు కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లను కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేసినఉన్నతాధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబాలకు 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలంటూ డిమాండ్ చేశారు .

### గోడ కూలి మృతి చెందిన రైతులకు న్యాయం చేయాలని బిజెపి నిరసన

నిన్న కురిసిన భారీ వర్షాల వల్ల ఈదురు గాలులతో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం పై కవర్లు కప్పడానికి వెళ్లి లక్షట్టిపేట మండలం గంపాలపల్లి , కొత్తూర్ గ్రామాల్లో జరిగిన ప్రమాదంలో నలుగురు రైతులు మరణించడం అత్యంత విషాదకరం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు రఘునాథ్ కలిసి ప్రమాద వివరాలు తెలుసుకొని వారికి మనోధైర్యం కల్పించడం జరిగింది. బాధిత కుటుంబాలకు తన వంతుగా ఒక్కొక్కరికి 50 వేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు .ఈ సందర్భంగా రఘునాథ్ గారు మాట్లాడుతూ... రైతులు ధాన్యం అమ్మకానికి కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చి నెల రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సరియైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కమీషన్ల కోసం రైస్ మిల్లర్ల తో కుమ్మక్కు అయ్యి కాంట పెట్టిన ధాన్యం లారీలు దొరకక ధాన్యాన్ని తరలించడంలో ప్రభుత్వం విఫలం అవ్వడంతో రైతులకు ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. నాలుగు రైతుల మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని అన్నారు. బాధితు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక్కక్కరికి 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# భారత రాజకీయాల్లో కీలక మలుపు కనిపిస్తోంది

## నిజమైన మార్పుకు మాత్రం చాలా దూరంలో వున్నాం!

కేరళం, తమిళనాడూ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి గల పరిమితులు స్పష్టంగా బయట పడుతున్నాయి. ఒకే పార్టీ ఆధిపత్యం, ఒకే మత రాజకీయాలూ, ఒకే జాతీయత నమూనా దేశమంతా సులువుగా పనిచేయవని ఈ రాష్ట్రాలు చూపిస్తున్నాయి. బీజేపీకి ఎదురుదెబ్బ తగలడం అంటే ప్రజలకు విముక్తి వచ్చినట్టా? హిందుత్వ రాజకీయాలకు అడ్డుకట్ట పడడం అంటే దోపిడీ వ్యవస్థ బలహీనపడినట్టా?




**బీజేపీ ఎదుగుదల వెనక వున్న అసలు శక్తి:**
బీజేపీని కేవలం "ఒక రాజకీయ పార్టీ"గా చూస్తే, సరిపోదు. ఇది భారత పెద్ద కార్పొరేట్ వర్గాల రాజకీయ యంత్రం. 2014 తర్వాత దేశంలో ఏమి జరిగింది? ప్రభుత్వ రంగాల అమ్మకం పెరిగింది. కార్పొరేట్ టాక్సులు తగ్గాయి. కార్మిక చట్టాలు బలహీనపడ్డాయి. వ్యవసాయం మార్కెట్ చేతుల్లోకి వెళ్లింది. విద్యా, ఆరోగ్యం మరింత వ్యాపారంగా మారాయి. ఇవన్నీ పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూల ఆర్థిక విధానాలు. అదే సమయంలో హిందుత్వ ప్రచారం, మత విద్వేషం, ఎన్సీఆర్, సీఏఏ, జాతీయత ఉన్మాదం, మీడియా ప్రచార యంత్రాంగం వంటివన్నీ ప్రజల వాస్తవిక ఆర్థిక సమస్యల నుంచి దృష్టిని మళ్లించే రాజకీయ ఆయుధాలుగా తయారయ్యాయి.

**దక్షిణ భారతం ఎందుకు భిన్నంగా నిలుస్తోంది?**
తమిళనాడూ, కేరళం వంటి రాష్ట్రాల్లో బీజేపీకి పూర్తి ఆధిపత్యం రాకపోవడానికి చారిత్రక కారణాలు ఉన్నాయి. తమిళనాడులో ద్రావిడ ఉద్యమం బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించింది. హిందీభాష రుద్దింపును ఎదిరించింది. సామాజిక న్యాయం భావనను ముందుకు తెచ్చింది. దీంతో "ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి" రాజకీయాలకు సహజంగానే ప్రతిఘటన ఎదురైంది.

కేరళంలో వామపక్ష ఉద్యమాల చరిత్రా, కార్మిక సంఘాల బలం, ప్రజా విద్యా, ప్రజా ఆరోగ్య వ్యవస్థా, సామాజిక చైతన్యం వంటివి మత రాజకీయాలకు పూర్తి స్థాయి స్థావరం దక్కకుండా చేశాయి. ఇది ఒక్కరోజులో ఏర్పడింది కాదు, దశాబ్దాల ప్రజా పోరాటాల ఫలితం.

**బెంగాల్ ఎందుకు యుద్ధభూమి అయింది?**
పశ్చిమ బెంగాల్ భారత రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన రాష్ట్రం. కార్మిక ఉద్యమాలూ, రైతు పోరాటాలూ, వామపక్ష రాజకీయాలూ, మేధో చర్చలూ ఇక్కడ బలమైన చరిత్రగా ఉన్నాయి. అందుకే, బీజేపీ, బెంగాల్ ని ప్రతిష్టాత్మక యుద్ధభూమిగా మార్చింది. మత ధ్రువీకరణలూ, ఎన్సీఆర్, సీఏఏ, శరణార్థి రాజకీయాలూ వంటివి ఇక్కడ బలంగా ప్రయోగించింది. కానీ, బెంగాల్ సామాజిక నిర్మాణం పూర్తి స్థాయి హిందుత్వ ఆధిపత్యాన్ని అంగీకరించలేదు.
కానీ, ప్రత్యామ్నాయం నిజంగానే ప్రత్యామ్నాయమా?
డీఎంకే అయినా, తృణమూల్ అయినా, మరే ప్రాంతీయ పార్టీలు అయినా, ఇవి బీజేపీకి ఎన్నికల ప్రత్యామ్నాయాలు కావచ్చు. కానీ, కార్పొరేట్ పెట్టుబడులను ఇవి వ్యతిరేకిస్తున్నాయా? ప్రైవేటీకరణ ఆపుతున్నాయా? కార్మిక దోపిడీని నిలిపేస్తున్నాయా? భూసేకరణకు వ్యతిరేకంగా నిలుస్తున్నాయా? చాలా సందర్భాల్లో సమాధానం "లేదు". అంటే, హిందుత్వ రాజకీయాలను ఎదిరించినా, పెట్టుబడిదారీ వ్యవస్థని మాత్రం ప్రశ్నించని రాజకీయాలే యివన్నీ. ఇది చాలా కీలకమైన విషయం.

**కొత్త ముఖాలు ఎందుకు వస్తున్నాయి?**
విజయ్ వంటి సినీ వ్యక్తుల రాజకీయ ప్రవేశం కూడా ఇదే సంక్షోభం ఫలితమని చెప్పవచ్చు. యువతలో నిరుద్యోగం, అస్థిర ఉద్యోగాలూ, గిగ్ ఎకానమీ, భవిష్యత్తుపై భయం, రాజకీయ పార్టీలపై విసుగూ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో "కొత్త ముఖం" వెంటనే ఆకర్షణగా మారుతుంది. కానీ, వ్యక్తులు మారడం వల్ల వ్యవస్థలో మార్పు రాదు కదా. అసలు ప్రశ్న: ఉత్పత్తి సాధనాలపై నియంత్రణ ఎవరిది? సంపద ఎవరి చేతుల్లో వుంది? లాభం ఎవరి కోసం?

**ఎన్నికల రాజకీయాల పరిమితి:**
ఈరోజు దేశ రాజకీయ చర్చ మొత్తం ఎన్నికల గణితం చుట్టూ తిరుగుతోంది, ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడతారు? ఎన్ని సీట్లు ఎవరికి వస్తాయి? అంటూ. కానీ, ప్రజల వాస్తవిక జీవితం ఈ చర్చల్లో వుండదు.
దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది. రైతు అప్పులు పెరుగుతున్నాయి. చిన్న వ్యాపారాలు కూలుతున్నాయి. కార్మిక హక్కులు బలహీనపడుతున్నాయి. ధరలు పెరుగుతున్నాయి. ఈ సమస్యలకు ఎన్నికల నినాదాలు సమాధానం కావు.

**అసలు పోరాటం ఎక్కడుంది?**
అసలు రాజకీయ శక్తి, పార్లమెంట్ లో మాత్రమే ఉండదు. కార్మిక సమ్మెల్లో, రైతు ఉద్యమాల్లో, విద్యార్థి పోరాటాల్లో, మహిళా ఉద్యమాల్లో, ప్రజా సంఘటిత నిరసనల్లో అసలైన పోరాట శక్తి కనిపించేది. ఎందుకంటే, చరిత్రని చివరకు మార్చేది ప్రజల సామూహిక పోరాటమే.

**హిందుత్వానికి వ్యతిరేక పోరాటం సరిపోదు!**
హిందుత్వ రాజకీయాలు ప్రమాదకరమే. అవి ప్రజలను మతం పేరుతో విభజిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి. మైనారిటీలను భయభీతులు చేస్తాయి. అయితే, కేవలం హిందుత్వ వ్యతిరేకత సరిపోదు. కార్పొరేట్ దోపిడీ ఇలాగే కొనసాగితే, మత విద్వేషం మళ్లీ వస్తుంది, ఫాసిస్టు రాజకీయాలు మళ్లీ పెరుగుతాయి, ప్రజా అసంతృప్తిని మళ్లీ మత దిశగా మళ్లిస్తారు. అందుకే, మత రాజకీయాలకు వ్యతిరేక పోరాటం, కార్పొరేట్ ఆధిపత్య వ్యతిరేక పోరాటంతో కలవాలి. దేశ రాజకీయాలకు ఇప్పుడు నిజంగానే ఒక "బ్రేక్" కనిపిస్తోంది. కానీ, అది ప్రజా విముక్తి దిశలో పూర్తి మార్పు కాదు. పార్టీలు మారుతున్నాయి. నాయకులు మారుతున్నారు. నినాదాలు మారుతున్నాయి. కానీ, సంపదపై ఆధిపత్యం మాత్రం అదే వర్గాల చేతుల్లో ఉంది. దేశాన్ని ఎవరు పాలిస్తున్నారు? ఎన్నికల్లో గెలిచినవారా? లేక సంపదని నియంత్రించే కార్పొరేట్ వర్గాలా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతక్కపోతే, ప్రజా రాజకీయాల భవిష్యత్తు అర్థం కాదు.

**ఆర్కే వెంకట్**
(సోషల్ బ్లాగ్ రైటర్)
8096480227
హైదరాబాద్



## ఆరోగ్య బోధిని

ఆసుపత్రి అంటే భయం కాదు,
అది కొత్త జీవితానికి వేదిక.
వాళ్ళ చిరునవ్వుతోనే
మళ్ళీ ప్రాణ వాయువులు చిగురిస్తాయి

రోగుల నొప్పికి మందు,
కుటుంబ సభ్యుల కన్నీటికి ఓదార్పు
ప్రాణాలమీద ఆశ ఇచ్చేచోటు
అదే వైద్యాలయం!!

ఈ హాస్పిటల్ గోడలు ఎన్ని కన్నీటి
ప్రార్థనలతో తడిసాయో!!
ఏ గుడి కూడా అన్ని వేదనలు
విని ఉండదు

జీవన్మరణాల మధ్య ఉగిసలాడినప్పుడు
పరిచయం లేని మనుషుల మధ్య
పరిచయమైన నొప్పులు.
బలహీనతను కప్పుకుంటూ,
బలపడాలని ఆరాటం.
మందుల మహత్యమో!!
డాక్టర్లు ఇచ్చే సంరక్షణో!!
మళ్లీ ప్రాణం పోసి
కోలుకుంటున్న వేళ
డిశ్చార్జ్ అనే మాట విన్నపుడు
మనసులో ఎగిరిన ఆశలపక్షి శ్వాసను
దేనితో ఖరీదు చేయగలం??
ఆ తెల్లటి గదులే!!ఒక్కోసారి
జీవిత సత్యాన్ని బోధిస్తాయి.

ఆందోళన నిండిన అడుగులసవ్వడి !
ఆపరేషన్ థియేటర్ బయట,
ఆశగా ఎదురుచూసే కళ్లు.
నిత్యం రద్దీ.. ఐనాసరే
వేదనతో వచ్చిన రోగుల ప్రాణాలకు,
వేదమంత్రంలా వైద్యం.
నొప్పిని మరిపించి,నవ్వును పంచి
తిరిగి బతుకు ఊపిరినిచ్చే...
నిజమైన ప్రాణదాతలు
వైద్య సిబ్బంది

**అనిత కృష్ణ**
9490876621

# ఉన్నత విద్య దేశ వ్యాప్తంగా సమస్యల వలయం

భారత ఉన్నత విద్య వ్యవస్థ చాలా సంవత్సరాలుగా అసమానతలకు నిలయంగా ఉంది. కేవలం కొన్ని ప్రతిష్టాత్మక సంస్థల చుట్టూ మొత్తం వ్యవస్థ తిరుగుతుండటం, మిగిలిన వేలాది కళాశాలలు నిధులు, మౌలిక సదుపాయాలు, నాణ్యత లేకుండా చితికిపోతుండటం నేటి వాస్తవం. ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీల వంటి సంస్థలు మొత్తం విద్యార్థుల్లో కేవలం 2.6 శాతం మందికి మాత్రమే సేవలందిస్తున్నా, ఉన్నత విద్య బడ్జెట్లో 50 శాతం పైగా నిధులు ఇవే పొందుతున్నాయి. మిగిలిన 97 శాతం మంది విద్యార్థులు ఆ నిధుల్లో మిగిలిన స్వల్ప నిధులతోనే సాగాల్సి వస్తోంది. ఇది తీవ్రమైన నిధుల అసమానతకు నిదర్శనం.
ప్రవేశ పరీక్షల పరిస్థితి కూడా అంతే దారుణం. గతేడాది ఐఐటీ జేఈఈకి 23 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు, కానీ అందుబాటులో ఉన్న సీట్లు కేవలం 18,191 మాత్రమే. నీట్ పరీక్షలోనూ ఇదే పరిస్థితి. దీనివల్ల విద్యార్థులు రేయింబవళ్లు చదివి తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పోటీ అనేది విజ్ఞాన పరిధిని విస్తరించడం కంటే కేవలం కొన్ని వేల సీట్ల కోసం జరిగే సంఘర్షణగా మారిపోయింది.
ప్రతిష్టాత్మక సంస్థలు - ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు కలిపి సుమారు 60,000 సీట్లు మాత్రమే అందిస్తున్నాయి. ఇది మొత్తం విద్యార్థుల్లో మూడు శాతం కంటే తక్కువ. కానీ వీటికి మాత్రమే నిధుల్లో సగానికి పైగా వెచ్చిస్తుండగా, మిగిలిన 650కి పైగా విశ్వవిద్యాలయాలు, 1338 విశ్వవిద్యాలయాలు, 50 వేలకు పైగా కళాశాలలు నమోదిత విద్యార్థులు 4.46 కోట్లు ఉండగా, వారిలో 3.2 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోనే చదువుతున్నారు. ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీల్లో కలిపి 10 లక్షల మంది మాత్రమే చదువుతున్నారు. అంటే కోట్లాది మంది నాణ్యత లేని విద్యకే పరిమితం అవుతున్నారు.
బడ్జెట్ కేటాయింపులు ఇంకా స్పష్టం చేస్తాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి విద్యకు 1.4 లక్షల కోట్లు కేటాయించగా, అందులో ఉన్నత విద్యకే 55,727 కోట్లు రాగా, ఐఐటీలకు 12,123 కోట్లు, ఐఐఎంలకు 292 కోట్లు, ఎన్ఐటీలకు 6260 కోట్లు, ఐఐఎస్సీ బెంగళూరుకు 845 కోట్లు, ఐఐఎస్ఈఆర్లకు 1319 కోట్లు వంతు పడ్డాయి. అంటే, మిగిలిన అన్ని విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలలు చాలా తక్కువ నిధులతోనే సాగాల్సి వస్తోంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల కళాశాలల్లో నాణ్యమైన ప్రయోగశాలలు, లైబ్రరీలు, అర్హులైన అధ్యాపకులు లేకుండా పోతున్నారు.
పరిశోధన మరో ముఖ్యమైన కోణం. భారత జీడీపీలో 0.6-0.7 శాతం మాత్రమే పరిశోధన, అభివృద్ధికి ఖర్చు చేస్తోంది. అమెరికా, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ బడ్జెట్లో గణనీయమైన భాగాన్ని పరిశోధనకు వెచ్చిస్తుండగా, భారత్ లో పరిశోధనకు తగిన ప్రాధాన్యత లేకపోవడం వల్ల నూతన ఆవిష్కరణలు, పేటెంట్లు, వినూత్న పరిష్కారాలు భారత విద్యా వ్యవస్థ నుంచి రావడం లేదు. కేవలం ఐఐటీలకు నిధులు కేటాయించడంతో మాత్రం ప్రపంచ సాంకేతిక రేసులో ముందుకు సాగలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఉద్యోగావకాశాల సంక్షోభం అన్నింటికన్నా తీవ్రమైన సమస్య. ఒక నివేదిక ప్రకారం, ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో 85 శాతం మందికి ఉద్యోగాలు లభించడం లేదు. లభించిన వారిలో చాలా మందికి తమ నైపుణ్యాలకు తగ్గ జీతం లభించడం లేదు. 80 శాతం మంది ఉద్యోగులు తమ నైపుణ్యాలకు అనుగుణంగా పని చేయడం లేదు. దేశంలో 56 శాతం మంది మాత్రమే నైపుణ్యం కలిగిన కార్మికులుగా పరిగణించబడుతుండటం పెద్ద దుర్భర స్థితి. దీనికి కారణం విద్యా వ్యవస్థకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పెద్ద గ్యాప్ ఉండటమే. పాత కాలం నాటి సిలబస్, సాఫ్ట్‌స్కిల్స్ లేకపోవడం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు లేకపోవడం వల్ల విద్యార్థులు నేరుగా ఉద్యోగాలకు అనర్హులుగా మారిపోతున్నారు.
విద్యలో నాణ్యత తగ్గుదల కూడా గమనించాల్సిన అంశం. స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 31 శాతం గానే ఉండటం చాలా మందికి ఉన్నత విద్య అందడం లేదని తెలుస్తోంది. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరు మాత్రమే ఉన్నత విద్యకు చేరుతున్నారు. గత దశాబ్దంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్‌లు సంఖ్యాపరంగా పెరిగినా, నాణ్యత మాత్రం క్రమంగా దిగజారింది. ప్రభుత్వ నిధులు తక్కువగా ఉండటంతో చాలా సంస్థలు స్వయం ఆర్థిక విధానం పెంచుకోవడంతో ఫీజులు ఆకాశాన్ని తాకాయి. దీనివల్ల మధ్యతరగతి, పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చదువు అనేది సామాజిక సమానత్వానికి మార్గం కాకుండా, ఆర్థిక స్థితిని బట్టి నిర్ణయించే సాధనంగా మారిపోతోంది.
పరిష్కారం కోసం నాలుగు కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. మొదటిది, పెట్టుబడుల పరిణామం ... ప్రతిష్టాత్మక సంస్థలకే కాక, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మరియు ప్రాంతీయ కళాశాలలకు సమాన ప్రాధాన్యతతో నిధులు పంపిణీ చేయాలి. రెండవది, సంస్థాగత నిర్మాణం ... ప్రతి కళాశాలలో మౌలిక సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు, మంచి లైబ్రరీలు తప్పనిసరి చేయాలి. మూడవది, పరస్పర సహకారంతో పరిశ్రమలతో భాగస్వామ్యం, ప్రయివేటు పెట్టుబడులు, అంతర్జాతీయ సహకారం విస్తరించాలి. నాల్గవది, ప్రతిభావృద్ధి అధ్యాపకుల నాణ్యత మెరుగుపరచడానికి ప్రత్యేక శిక్షణ, స్కాలర్‌షిప్ కార్యక్రమాలు అమలు చేయాలి.
ఒక్క మాటలో చెప్పాలంటే, మూడు శాతం మందికి 50 శాతం నిధులు, 97 శాతం మందికి మిగిలిన 50 శాతం నిధులు - ఈ లెక్క భారత ఉన్నత విద్యను రెండు విభాగాలుగా చీల్చేసింది. ఒక వైపు ప్రతిభావంతులు కొద్దిమందికి మంచి సౌకర్యాలు, రెండోవైపు కోట్లాది మంది నాణ్యత లేని విద్యావ్యవస్థలో చిక్కుకుపోతున్నారు. దేశాభివృద్ధికి ఈ అసమానతలు అతిపెద్ద ప్రతిబంధకం. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య లభించాలంటే నిధుల పంపిణీలో సమానత్వం తీసుకురావడం, పాఠ్య ప్రణాళికలను నవీకరించడం, పరిశోధనను ప్రోత్సహించడం, పరిశ్రమలతో అనుసంధానాన్ని బలోపేతం చేయడం - ఇవే లక్ష్యాలుగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. లేదంటే, భారత ఉన్నత విద్య మరో దశాబ్దం పాటు ఇదే సమస్యలతో సతమతమవుతూనే ఉంటుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**


## శ్రీ కాళ హస్తి!

గుడికొచ్చిన వాళ్ళు
అంతా శివభక్తులే!
శ్రీ -కాళ -హస్తి
ప్రదర్శన భక్తి
కావలసింది ముక్తి!
సాధనలే వేరు!
మనుషులూ అంతే!
లోకోభిన్నరుచి!
అంతా శ్రీకాళహస్తి!
ఎవరిమార్గం వారిది!
ఒకరికి నచ్చింది
మరొకరికినచ్చదు!
సంసారంలోనూ ఇంతే!
ఈ కథ సార్వజనీనం!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# అభివృద్ధి పేరిట అన్నదాత సర్వం కోల్పోవాలా?

## అభివృద్ధి వర్సెస్ అన్నదాత: భూసేకరణ వివాదాలు



తెలంగాణను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో చేపట్టిన భారీ సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక పురోగతికి బాటలు వేశాయి. అయితే, ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా లోయర్ మానేరు, మిడ్ మానేరు నుండి నేటి కాళేశ్వరం (మల్లన్న సాగర్) వరకు భూసేకరణ ప్రక్రియలో 2013 చట్టం అమలుపై ప్రభుత్వం మరియు రైతుల మధ్య జరిగిన పోరాటం తెలంగాణ చరిత్రలో ఒక కీలక ఘట్టం.


**1. మానేరు ప్రాజెక్టుల నిర్వాసితుల వ్యథ :**
**లోయర్ మానేరు డ్యామ్ :** దశాబ్దాల క్రితం కరీంనగర్ వద్ద నిర్మించిన ఈ ప్రాజెక్టు వల్ల వేలాది ఎకరాలు మునిగిపోయాయి. అప్పట్లో తక్కువ పరిహారం పొందిన రైతులు నేటికీ తమకు సరైన పునరావాసం దక్కలేదని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.
**మిడ్ మానేరు ప్రాజెక్టు :** సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 12 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. 10 వేల మందికి పైగా నిర్వాసితులయ్యారు. పదేళ్ల కాలయాపన తర్వాత ఇచ్చిన పరిహారం పెరిగిన ధరలకు ఏమాత్రం సరిపోకపోవడంతో రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**2. కాళేశ్వరం ప్రాజెక్టు - మల్లన్న సాగర్ పోరాటం**
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అతిపెద్ద రిజర్వాయర్ మల్లన్న సాగర్. 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ రిజర్వాయర్ కోసం సిద్దిపేట జిల్లాలో భారీ భూసేకరణ జరిగింది.
ముంపు గ్రామాలు: వేములఘాట్, ఎటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, లక్ష్మాపూర్ వంటి 8 గ్రామాలు ఈ ప్రాజెక్టు కింద జలసమాధి అయ్యాయి.
**నిర్వాసితుల సంఖ్య:** సుమారు 30,000 మంది ప్రజలు తమ ఇళ్లు, పొలాలు వదులుకోవాల్సి వచ్చింది.

**3. 2013 చట్టం వర్సెస్ జీవో 123: ప్రభుత్వం వాదన**
మల్లన్న సాగర్ భూసేకరణ సమయంలో అప్పటి నీటిపారుదల శాఖ, తెలంగాణ ప్రభుత్వం 2013 కేంద్ర చట్టం ప్రకారం పరిహారం ఇవ్వడం సాధ్యం కాదని పేర్కొనడం పెద్ద వివాదానికి దారితీసింది.
ప్రభుత్వ వాదన: 2013 చట్టం ప్రకారం భూమి సేకరిస్తే సామాజిక ప్రభావ అంచనా (ఎస్ఐఏ), బహిరంగ విచారణ వంటి ప్రక్రియల వల్ల ప్రాజెక్టు ఆలస్యం అవుతుందని ప్రభుత్వం వాదించింది. దీనికి ప్రత్యామ్నాయంగా లిలిజీవో 123 లిను తీసుకువచ్చింది. దీని ద్వారా రైతులతో నేరుగా ఒప్పందం చేసుకుని నగదు చెల్లించాలని భావించింది.
రైతుల వ్యతిరేకత: 2013 చట్టంలో ఉన్న పునరావాసం, ఉపాధి కల్పన, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వంటి ప్రయోజనాలు జీవో 123లో లేవని రైతులు గ్రహించారు. ముఖ్యంగా వేములఘాట్ గ్రామ ప్రజలు దాదాపు 1000 రోజులకు పైగా నిరసన దీక్షలు చేపట్టి, 2013 చట్టం ప్రకారమే పరిహారం కావాలని పట్టుబట్టారు.

**4. ప్రజా ఉద్యమాలు మరియు కోర్టు జోక్యం**
మల్లన్న సాగర్ భూసేకరణపై జరిగిన పోరాటం జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించింది.
పోలీసుల ఆంక్షలు: నిర్వాసిత గ్రామాల్లో 144 సెక్షన్ విధించడం, లాఠీఛార్జ్ చేయడం వంటి చర్యలు ఉద్రిక్తతలకు దారితీశాయి.
**న్యాయపోరాటం:** ప్రభుత్వం తెచ్చిన జీవో 123 చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ఇళ్లను ఖాళీ చేయించకూడదని స్పష్టం చేసింది. చివరికి రైతుల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించడానికి మరియు 'గజ్వేల్ ఆర్అర్ కాలనీ' వంటి ఆధునిక పునరావాస కేంద్రాలను నిర్మించడానికి అంగీకరించింది.

**5. గణాంకాలు మరియు సామాజిక నష్టం**
మల్లన్న సాగర్ కోసం సుమారు 17,000 ఎకరాల సాగు భూమిని సేకరించారు.
పరిహారం విషయంలో ఎకరాకు రూ. 6 లక్షల నుండి ప్రారంభించి, పోరాటాల తర్వాత రూ. 12 నుండి రూ. 15 లక్షల వరకు పెంచాల్సి వచ్చింది.
అయితే, నగదు రూపంలో అందిన పరిహారం మనుషుల మధ్య ఉన్న సామాజిక బంధాలను, గ్రామీణ సంస్కృతిని తిరిగి ఇవ్వలేకపోయిందని సామాజికవేత్తలు స్పష్టం చేసారు.
నీళ్లు లేని తెలంగాణకు ప్రాజెక్టులు ప్రాణవాయువు వంటివి. కానీ ఆ ప్రాజెక్టుల కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు వెనకడుగు వేయకూడదు. మల్లన్న సాగర్ రైతుల పోరాటం 2013 చట్టం యొక్క ప్రాముఖ్యతను మరియు ప్రజాస్వామ్యంలో ప్రజల సమ్మతి ఎంత అవసరమో ప్రపంచానికి చాటిచెప్పింది.




**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# "ఊపా" కుట్రను ఛేదించిన తీర్పు

## సత్యానికి న్యాయస్థానమే ఆశ్రయం"

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు ఉన్న స్థానం మరొకదానితో పోల్చలేము. అది ప్రభుత్వ దుశ్చర్యలకు, అణచివేతకు ఎదురుదెబ్బ తగిలించే శక్తి దానికి ఉంది. హనుమకొండ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి మంత్రి రామకృష్ణ సునీత ఇటీవల ఇచ్చిన తీర్పు ఆ అద్దంలో ప్రజాస్వామ్యం ముఖం ఎలా ప్రతిబింబించాలో చూపించింది. ఉగ్రవాద నిరోధక చట్టం (UAPA) లాంటి కఠిన చట్టాన్ని ఒక జర్నలిస్టు, ఒక విద్యార్థి నేతపై ప్రయోగించడం వెనుక రాజకీయ కక్ష తప్ప మరేదీ లేదని, ఆ ఆరోపణలన్నీ నిరాధారమని కోర్టు స్పష్టం చేసింది. ఇది కేవలం ఇద్దరి విడుదల మాత్రమే కాదు; ప్రశ్నించే తత్వాన్ని, వ్యతిరేకించే స్వరాన్ని బెదిరించే వ్యవస్థకు పెద్ద ఎత్తున హెచ్చరిక.
కంచెర్ల బద్రి- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్.డీ స్కాలర్, విద్యార్థి సమస్యలపై నిరంతరం గళమెత్తే ఉద్యమకారుడు. దామెర రాజేందర్- వరంగల్ ప్రాంతంలో అక్రమ మైనింగ్‌లను ఛేదించే వార్తా కథనాలు రాసే జర్నలిస్టు. ఇద్దరి మధ్య ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, వారిద్దరినీ ఒకే కేసులో నిందితుల్ని చేయడం, అందులో "ఊపా" లాంటి చట్టాన్ని ముడిపెట్టడం- ఇది స్పష్టమైన లక్ష్యంగా నిరూపించబడింది. పోలీసులు చేసిన ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం సూక్ష్మంగా పరిశీలించింది. 'నిషేధిత జాబితాలో లేని పార్టీ పేరును ఎఫ్ఐఆర్‌లో ఎలా చేరుస్తారు?' అనే సీనియర్ న్యాయవాది పులి సత్యనారాయణ ప్రశ్నకు ప్రాసిక్యూషన్ వద్ద జవాబు లేకపోవడం, ఈ కేసు బలహీనతను తెలియజేసింది. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు. ఇది చట్టాన్ని దుర్వినియోగం చేసే వారి మానసిక పరిస్థితిని చూపిస్తుంది.
పోలీసులు 'మావోయిస్టు సాహిత్యం'గా చూపిన పుస్తకాలు సామాన్యుల ఇండ్లలో, న్యాయవాదుల ఆఫీసుల్లో సైతం దొరికే సాధారణ పుస్తకాలేనని నిరూపించబడింది. రాజేందర్ తన వృత్తిలో భాగంగా అక్రమాలను ప్రశ్నించాడు. దానికి ప్రతీకారంగా అతన్ని 'నేరస్తుడి'గా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. ప్రపంచంలో ఎక్కడైనా, పాత్రికేయులు ప్రశ్నించడమే తమ ప్రాథమిక విధిగా భావిస్తారు. అలాంటిది. ప్రశ్నించినందుకు "ఊపా" లాంటి కఠిన చట్టాన్ని ప్రయోగించడం అంటే "పిచ్చుక పై బ్రహ్మ అస్త్రం" ప్రయోగించి నట్లు ... ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయటం తప్ప మరొకటి కాదు. గణాంకాలను పరిశీలిస్తే, జాతీయ స్థాయిలో "ఊపా" (UAPA) కేసుల్లో 95 శాతం పైగా విచారణ పూర్తయిన తర్వాత నిర్దోషిగా తేలిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. అంటే ఈ చట్టం ఉగ్రవాదాన్ని అరికట్టడం కంటే ప్రతిపక్ష స్వరాలను నొక్కడానికే ఎక్కువ ఉపయోగించబడుతోందని ఇది సూచిస్తుంది.



ఈ తీర్పు యొక్క ప్రాధాన్యత మరో ముఖ్యమైన సందర్భాన్ని కూడా హైలైట్ చేస్తుంది. భారతదేశంలో నివేదికల ప్రకారం, 2014-2020 మధ్యకాలంలో"ఊపా" UAPA నమోదు చేసిన కేసుల సంఖ్య దాదాపు 500 శాతం పెరిగింది. అయితే ఈ కేసుల్లో నేరస్థాపన రేటు అతి తక్కువ. అంటే చాలా కేసులు నిరాధారం అని లెక్క తేలింది. పోలీసులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ,లేదా రాజకీయ పలుకుబడి గల వ్యక్తుల ఒత్తిడి మేరకు పూర్తిగా రుజువు లేని సందర్భాల్లోనే ఈ చట్టాన్ని ప్రయోగిస్తున్నారనట్లు కనిపిస్తుంది. హనుమకొండ కోర్టు తీర్పు ఈ ధోరణికి ఒక ఉదాహరణగా నిలిచింది. 'సాక్ష్యమే దేవుడు' అని నిరూపించింది.
అయితే, ఈ ఒక్క తీర్పు సరిపోతుందా? ఇంకా చాలా చేయవలసి ఉందని గుర్తించాలి. ఈ కేసులో న్యాయస్థానం నిజాయతీగా వ్యవహరించింది. కానీ ప్రతి కోర్టు ఇలాగే ఉంటుందా? ప్రతి జడ్జి ఇంత ధైర్యంగా నిర్ణయం తీసుకుంటారా? అనేది ప్రశ్న. కేసులు నమోదు చేసే ముందు సాక్ష్యాలను పరిశీలించడంలో అజాగ్రత్త- లేదా బయట పలుకుబడి గల మైనింగ్ మాఫియా ఒత్తిడులు కారణం కావచ్చు. ఇలాంటివి పెద్ద సమస్యలుగా మారాయి. న్యాయస్థానం ఈ సందర్భంలో బద్రి, రాజేందర్ల పట్ల న్యాయం చేసి ఉండవచ్చు. కానీ ఇంకా "ఊపా" చట్టం కింద జైళ్లలో మగ్గుతున్న వారు ఎందరో ఉన్నారు. వారికి ఇలాంటి అదృష్టం దక్కకపోవచ్చు. చట్టాలు నేరస్తులను శిక్షించడానికి, నిరపరాధులను రక్షించడానికి కే ఉన్నాయి.
అంతే కానీ ప్రజా సమస్యల కోసం పోరాడే ఉద్యమకారులను లేదా విలేఖరులను భయపెట్టడానికి కాదు. ఈ సత్యాన్ని హనుమకొండ కోర్టు తీర్పు గట్టిగా చాటిచెప్పింది. ఈ తీర్పు ఇతర కోర్టులకు, మరీ ముఖ్యంగా దర్యాప్తు సంస్థలకు ఓ సందేశంగా నిలవాలి. అక్రమ కేసులు పెట్టి జైళ్లలో మగ్గించొచ్చు కానీ, సత్యాన్ని నిలువరించడానికి ఒక్క తీర్పు మాత్రమే చాలదు; ఆ విధానంలో సమూల మార్పు రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన శ్రీరామరక్ష పొందుతుంది. ఇలాంటి సందర్భాల్లో న్యాయస్థానాలు మరింత చురుగ్గా స్పందించాలి. మాట్లాడే హక్కు, ప్రశ్నించే హక్కు ప్రతి పౌరునికి ఉంది. దాన్ని అణచివేయడానికి ఏ చట్టాన్నీ ఆయుధంగా మలచరాదు. చివరికి, సత్యం గెలుస్తుంది. ఈ తీర్పు ఆ సత్యానికి మరో ఉదాహరణ మాత్రమే.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# రైతు రాజు కావాలి అంటే ప్రభుత్వ చేయూతపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మే 6 (జనంసాక్షి) :** రైతులు ఒకే రకమైన పంట కాకుండా తరచుగా పంట మార్పిడి, భూసారం, ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న సహకారం పై రైతుకు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే రైతు మంచి లాభాలు పొందుతూ రాజుగా ఉంటాడని లేకుంటే కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగ గోపాల్ పేట మండలం సహకార సంఘం ఆధ్వర్యంలో గోపాల్పేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే, 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు జిల్లాలో రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, రైతు అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో రైతులకు పంట సాగు పై మెళుకువలు, పంట మార్పిడి వల్ల లాభాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బ్యాంకు ఋణాలు తదియత అంశాల పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందనీ చెప్పారు. రైతులకు భూ ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డ్) ఇవ్వడం జరుగుతుందని, శాస్త్రజ్ఞులు రైతు పొలాన్ని పరిశీలించి భూమిలో ఉన్న సారం, భూమిలో నత్రజని, పోటాష్, భాస్వరం తదితర ఏ ధాతువు తక్కువ అయ్యింది, ఏది ఎక్కువ అయ్యింది అనేదానిపై అధ్యయనం చేసి అట్టి పొలంలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే అంశాలను సాయిల్ హెల్త్ కార్డు ద్వారా రైతులకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల జిల్లాలోని రైతులు అందరూ సాయిల్ హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల తాత్కాలికంగా మొక్కలు పచ్చగా ఏపుగా కనిపిస్తుంది కానీ ముద్దగా ఏర్పడి పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోతుందని తెలియజేశారు. అదేవిధంగా కిసాన్ క్రెడిట్ కార్డు ప్రతి రైతు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో రైతులకు కేవలం 7-9 శాతం వడ్డీతో రుణాలు అందిస్తాయని, వాటిని సకాలంలో తిరిగి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా 3 శాతం వడ్డీని తిరిగి రైతుకు చెల్లిస్తుందని చెప్పారు. ప్రతిసారి ఒకే రకమైన పంట వేయడం వల్ల భూమి సారం కోల్పోయి దిగుబడి తగ్గిపోతుందని అందువల్ల తరచుగా పంట మార్పిడి చేస్తూ ఉంటేనే భూమి సారవంతంగా ఉండి మంచి దిగుబడి ఇస్తుందన్నారు. భావితరాలకు సైతం మంచి సారవంతమైన భూమిని అందించాల్సిన బాధ్యత అందరూ రైతులపై ఉందన్నారు. అందువల్ల కేవలం వరి పంట సాగు మాత్రమే కాకుండా వేరు సెనగ, పామాయిల్, కూరగాయలు తదితర వాణిజ్య పంటలు సాగుచేసుకొని రైతులు లాభాలు పొందాలని సూచించారు. జిల్లాలో గన్ని బ్యాగుల కొరత రానివ్వబోమని, పశ్చిమ బెంగాల్లో ఎన్నికలు, పశ్చిమాసియాలో యుద్ధాల వల్ల గన్ని బ్యాగుల సరఫరాలో కొంత జాప్యం జరిగిందని దీనిని త్వరలో అధిగమించడం జరుగుతుందన్నారు. ఈరోజు రేవల్లి మండలానికి 10 వేల గన్ని బ్యాగులు పంపించడం జరుగుతుందని, మిగిలిన మండలాలకు సైతం కొరత లేకుండా చేసి వరి, మొక్క జొన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గోపాల్పేట పి. ఎ.సి.ఎస్ చైర్మన్ ఎల్. రఘు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద రావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి బి. రాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, నాబార్డ్ డి డి.యం. మనోహర్ రెడ్డి, ఎల్.డి.యం శివకుమార్ సైతం రైతులకు వ్యవసాయ సాగు, రుణాల పై అవగాహన కల్పించారు. తహసిల్దార్ తిలక్, ఎంపీ.డి. ఒ, గోపాల్పేట, రేవల్లి, ఎదుల గ్రామాల సర్పంచులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలి





**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) :** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న నీటి పారుదల ప్రాజెక్టులకు భూసేకరణ కు సంబంధించి పెండింగ్ పనులపై చర్చించారు. ముఖ్యంగా మక్తల్ నారాయణ పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం, భీమా కోయిల్ సాగర్, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, బుద్వేల్ - నాచారం రింగ్ రోడ్ భూ సేకరణ పనులను వేగిరం చేయాలన్నారు.వారం రోజుల్లో భూసేకరణ పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. కోస్గి పట్టణ రహదారి విస్తరణ పనుల్లో కూడా ఏమైనా భూసేకరణ పనులు పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయా భూసేకరణ పనులకు సంబంధించిన నష్టపరిహారం పై డబ్బుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్ డీ సీ/ఆర్డీవో రాజేందర్ గౌడ్ , ఏ వో శ్రీధర్, నీటి పారుదల శాఖ సీ.ఈ. సత్య నారాయణ రెడ్డి, ఎస్.ఈ. శ్రీధర్, తహసీల్దార్లు బక్క శ్రీనివాస్ , సతీష్ కుమార్, చింత రవి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లలో చోరీకులకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్




**శేరిలింగంపల్లి, మే 6 (జనంసాక్షి) :** వ్యసనాలకు అలవాటు పడి జల్సా జీవితాన్ని కొనసాగించాలన్న దురుద్దేశంతో దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్న ఇద్దరు నిందితులు కటకటాల పాలైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు కూకట్పల్లి ఏసిపి వెల్లడించిన వివరాల ప్రకారం... నారాయణఖేడ్ జిల్లా ముబారక్ పూర్ ప్రాంతానికి చెందిన కీసరి పవన్ కుమార్(24) బ్రతుకుతెరువు నిమిత్తం నగరానికి వచ్చి కేపీహెచ్బీ లోని పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో నివాసం ఉంటూ రాపిడో డ్రైవర్ గా కొనసాగుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన గైని సాయిలు(24) టీ మాస్టర్ గా కొనసాగుతూ పవన్ కుమార్ తో ఏర్పడిన పరిచయం వారిరువుని వ్యసనాలకు బానిసగా మార్చి జల్సా జీవితాన్ని గడపడానికి దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని పగలు సమయంలోనే దొంగతనాలకు పాల్పడుతూ దొంగిలించిన సొమ్మును అమ్ముకొని సొమ్ము చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. ఈ క్రమంలో మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దొంగతనాలకు, ఎస్.ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో దొంగతనానికి మీరు పాల్పడినట్లు విచారణలో తేలింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులపై నిఘాను పెట్టి ఎట్టకేలకు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. కాగా వారి వద్ద నుండి డెల్ కంపెనీకి చెందిన రెండు లాప్టాప్ లను, ఒక వివో మొబైల్, ఒక ఒప్పో మొబైల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. నారాయణఖేడ్ లోని ముత్తూట్ ఫైనాన్స్ లో 6 గ్రాముల బంగారు ఆభరణాలను కుదువబెట్టినట్లు నిందితులు అంగీకరించాలని, త్వరలోనే వాటిని కూడా స్వాధీనపరచుకొని దర్యాప్తును కొనసాగిస్తామని ఏసిపి వివరించారు. నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ లక్ష రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు.

# సైబరాబాద్ సమగ్రాభివృద్ధికి కృషి



**శేరిలింగంపల్లి, మే 6 (జనంసాక్షి) :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతం సమగ్ర అభివృద్ధిని సాధించడం ద్వారా నగరానికి ఒక మోడల్ ప్రాంతంగా అభివృద్ధి పరచాలని తమ లక్ష్యం అని, ఇందుకోసం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి అధికారుల సమీక్ష సమావేశానికి హాజరై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోనల్ స్థాయి సమీక్ష సమావేశం సమర్థవంతంగా జరిగిందని, సమావేశంలో జోనల్ పరిధిలోని అన్ని విభాగాల హెడ్స్ పాల్గొన్నారని తెలిపారు. జోనల్ కార్యాలయం పరిధిలోని అన్ని విభాగాల మధ్య అంతర్గత సమన్వయం ఎట్టి పరిస్థితులలోనూ లోపించకూడదని సూచించడం జరిగిందని, ఇదే విషయాన్ని జోనల్ కమిషనర్ నారాయణ్ కు సూచించడం జరిగిందన్నారు. ప్రతి అధికారి తమ బాధ్యతను గుర్తు ఎరిగి మసలుకుంటూ పనుల్లో జాప్యాన్ని నివారించాలని ఈ సందర్భంగా సిఎంసి కమిషనర్ ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పౌర సేవల సహకారం మరింత సమర్థవంతంగా ఉండాలని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని కమిషనర్ సృజన తెలియజేశారు. సూచించారు. వార్షిక లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి విభాగం ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, క్రింది స్థాయి అధికారులు సిబ్బందితో మంచి సమన్వయం, సంబంధాలను కొనసాగించడం ద్వారా ముందుకు సాగాలని కమిషనర్ ఆదేశించారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని భూగర్భ డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు మరియు ఇతర అత్యవసర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సకాలంలో పనులను పూర్తి చేయడానికి అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి జోనల్ పరిధి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు పారదర్శకంగా ఉండాలి

● ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన
● అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి ప్రతినిధి, మే 6 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు పారదర్శకంగా ఉండాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. బుధవారం పుల్కల్ మండలంలోని పుల్కల్, గొంగళూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, రికార్డు నిర్వహణ, తేమ శాతం తదితర అంశాలను వివరంగా తనిఖీ చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని అమ్ముకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు తగిన మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకారం చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం రవాణాకు సంబంధించి జాప్యం జరగకుండా ట్రాన్స్పోర్ట్ వాహనాలను పెంచాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని, రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## రైతుల అభ్యున్నతే రాష్ట్ర సర్కారు ధ్యేయం




**అయిజ, మే 6 (జనం సాక్షి) :** రైతన్నను రారాజు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, అందుకు అనుగుణంగానే రైతు సంక్షేమ పథకాలు నేరుగా రైతులకు అదేవిధంగా రేవంత్ సర్కారు కృషి చేస్తున్నదని ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణంలో సహకార శాఖ ఆధ్వర్యంలో రైతు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా,పండించిన పంటలకు గిట్టుబాటు ధర తో పాటు రైతులకు కావాల్సిన విత్తనాలు ఫర్టిలైజర్ పెస్టిసైడ్లను ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అందిస్తుందని ఆయన వివరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అయిజ ఆధ్వర్యంలో రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద 19 కోట్ల రూపాయలను, స్వల్పకాలిక పంట రుణాల కింద 8 కోట్ల రూపాయలు అందించామని, ఫర్టిలైజర్ పెస్టిసైడ్ షాపు సూపర్ మార్కెట్ వల్ల రైతులకు సామాన్య ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన నిత్యవసర వస్తువులు అందిస్తున్నామని ఆయన వివరించారు. మండల వ్యవసాయ అధికారి జనార్దన్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్న దృష్ట్యా భవిష్యత్తులో డిఏపి యూరియా లాంటి రసాయన ఎరువులకు ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని అందుకే నానో యూరియా నానో డిఏపి అందుబాటులో ఉన్నాయని వాటితో పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సులోచనమ్మ, ఈడిగొని పల్లె సర్పంచ్ బడే సాబ్, ఆయా క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కోసం పోరాడాలి




**జడ్చర్ల, మే 6 (జనంసాక్షి) :** బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కోసం పోరాడాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రంలో బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో ఛత్రపతి సాహు మహారాజ్ 104వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహు మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్ మాట్లాడుతూ 1902లోనే బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన సాహు మహారాజ్ సామాజిక న్యాయానికి బలమైన పునాది వేశారని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను గ్రామాల వారీగా వెంటనే ప్రకటించాలని, గ్రామ జనాభాను యూనిట్‌గా తీసుకొని బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గొడుగు నర్సిములు, జహంగీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● అధికారులను ఆదేశించిన సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి
● కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**చేర్యాల, మే 6 (జనంసాక్షి) :** రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని, అన్ని వరి ధాన్య సెంటర్‌లలో కొనుగోలు వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సెంటర్ అధికారులను ఆదేశించారు. బుదవారం చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ, మండలంలోని వేచరేణి, కొమురవెల్లి మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనికి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో మక్కలు, వరి ఒకే సారి మార్కెట్ కు వస్తుందని చేర్యాల చుట్టుపక్కల నుండి కాకుండా జనగాం జిల్లా బచ్చన్నపేట, నర్మేట మండలాల నుండి మక్కలు చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కి వస్తుందని అందుకే కొనుగోలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని 3 రోజుల్లో అన్ని ఇబ్బందులు తొలగిపోతాయని అప్పటి వరకూ రైతులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. వరి మీకు దగ్గరలోని గ్రామాల సెంటర్ లో అమ్ముకోవాలని సూచించారు. సెంటర్ లో గన్నీలు, హమాలీ, కంటాల, లారీల కొరత లేకుండా కొనుగోలు సజావుగా జరపాలని ఏ ఏం సి ఛైర్మన్ మరియు సిబ్బందిని ఆదేశించారు. వేచరేణి గ్రామంలో ఎక్కువ మొత్తంలో ధాన్యం ఉందని లారీల కొరత ఉందని రైతులు తెలపగా లారీలలో కాకుండా అందుబాటులో ఉన్న ట్రాక్టర్, ఇతర వాహనాలలో నింపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. గతంలో ట్రాక్టర్ లలో ధాన్యం తరలించిన డబ్బులు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా డిఏం సివిల్ సప్లై ఫోన్ లో మాట్లాడి ఎందుకు రాలేదని ఆరా తీసి తప్పకుండా డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తేమ శాతం వచ్చి తాలు తిస్తేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని, సెంటర్ లో అన్ని సౌకర్యాలు ఉండాలని పాడి క్లీనర్, కంటాల రిపేర్లు చేయించుకోవాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని, కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు.

## నీళపల్లి తండాలో ఉద్రిక్తత

● పాత కక్షలతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు



**బషీరాబాద్, మే 6 (జనం సాక్షి) :** బషీరాబాద్ మండల పరిధిలోని నీళ్లపల్లి తండాలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం ఒక శుభకార్యం లో పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తండాలో శాంతి వాతావరణం నెలకొల్పారు. ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేయనున్నారని గ్రామస్తులు తెలిపారు.

# రైతుల సంక్షేమంలో సహకార సంఘాల పాత్ర కీలకం

- యూరియా వినియోగాన్ని తగ్గిస్తేనే నేల సంరక్షణ
- భిన్న పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా ఎదగాలి
- ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ, మే 6 (జనం సాక్షి) :** రైతులు ఒకే పంటను కాకుండా భిన్న పంటలు సాగు చేస్తే ఆర్థికంగా ఎదగవచ్చని, ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం గద్వాల పిఎసిఎస్ లో సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేందుకు సహకార సంఘాల కృషి ఎంతో ఉందని, రైతుల సంక్షేమానికి రుణాలు ఇవ్వడం, సబ్సిడీకి విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. కొద్ది రోజుల కిందట జిల్లాలోనీ రైతులకు కొరత లేకుండా యూరియాను సరఫరా చేయడంలో ఆయా మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయని కొనియాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రతి పిఏసిఎస్ కు 100 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించినందున సంఘాల సభ్యులు సాగు చేసేందుకు సహకరించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయిల్ పామ్ పంట సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటను మూడేళ్ల పాటు జాగ్రత్తగా పెంచితే దాదాపు 25 ఏళ్ల పాటు ఫలితాలు పొందవచ్చన్నారు. జిల్లాలోని గ్రౌండ్ వాటర్ నివేదికను ఇటీవల పరిశీలిస్తే నైట్రేట్ శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందన్నారు. యూరియాను అవసరానికి మించి వాడడం వలన నీళ్లు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని నేలను కాపాడుకోవాలంటే ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా పిఎండిడీకేవై కు ఎంపికవడంతో రైతులు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు. సంప్రదాయ పంటలే కాక మిల్లెట్స్, ఉద్యాన తోటలపై, పశుపోషణపై దృష్టి సారిస్తే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి రుణమాఫీ, రైతు భరోసా, బీమా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గద్వాల పిఎసిఎస్ ఉత్పత్తిదారుల సహకార సంఘంకు ఎంపికవడంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రూ.15 లక్షలు మంజూరవడంతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడతామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పిఎసిఎస్ చైర్మన్ సుభాన్, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఎల్డిఎం శ్రీనివాసరావు, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, పిఎసిఎస్ సీఈవో వెంకటేశ్వర్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్
- అమృత్ 2.0 పనుల పరిశీలన..



**పెబ్బేరు, మే 6 (జనం సాక్షి) :** అమృత్ 2.0 పనుల నాణ్యత, వేగం, మరియు సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశించారు. పెబ్బేరు పురపాలికల్లో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అమృత్ 2.0 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పనుల నాణ్యత, వేగం, సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అదనంగా, పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దశలో పర్యవేక్షణ పెంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమీషనర్ ఖాజా అరిపుద్దీన్, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

# మోడీ బహిరంగ సభను విజయవంతం చేయండి

- నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్చార్జి అమర్నాథ్



**తెల్కపల్లి, మే 6 (జనం సాక్షి) :** ఈనెల 10వ తేదీన హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్నటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయుట కొరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి బిజెపి మండల కార్యకర్తలతో నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జి అమర్నాథ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి జనసమీకరణ కోసం కార్యాచరణ చేపట్టాలని కార్యకర్తలకు తెలియజేశారు. రాబోవు రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జెండా ఎగురవేస్తుందని, మొన్న జరిగిన 5 రాష్ట్రాల ఫలితాలలో బీజేపీ ఏకంగా మూడు రాష్ట్రాలలో బీజేపీ జెండా ఎగిరిందని తెలియజేశారు. కొత్తపల్లి రవి కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం హిందూ దేశం అలాంటి మన దేశంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని మన శత్రు దేశాలను టెర్రరిస్ట్ లను మన దేశంలో నివాసానికి అవకాశం ఇస్తున్న బెంగాల్ మమతా బెనర్జీ లాంటి వారికి ప్రజలే గట్టి సమాధానం ఇచ్చారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో తెలంగాణ లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సంవత్సరానికే ఛతికిలా పడ్డదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని పరిపాలించడానికి చేతగాని రేవంత్ రెడ్డి, మోదీ మీద విమర్శలు చేయడం హాస్య స్పదంగా ఉందాన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, నరేంద్ర చారి, వెంకటేష్, చంద్రమౌళి, మధు గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సహజ వ్యవసాయంతో నేల ఆరోగ్యం కాపాడాలి

**మక్తల్, మే 6 (జనంసాక్షి) :** రైతులు తమ పొలాల్లో యూరియా ఇతర రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ ఎరువుల వినియోగాన్ని పెంచుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడాల్సిందిగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శైలు సూచించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సహజ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని అన్నారు. బుధవారం నారాయణ పేట జిల్లా మక్తల్ మండలంలోని అనుగొండ క్లస్టర్, గడ్డంపల్లి గ్రామ రైతు వేదిక ప్రాంగణంలో తెలంగాణ, రైతు విజ్ఞాన కేంద్రం(టివికె) నారాయణపేట వారి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సస్య రక్షణ శాస్త్ర వేత్త డాక్టర్ శైలు రైతులనుద్దేశిస్తూ మాట్లాడుతూ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు. యూరియా ఇతర రసాయన ఎరువుల వినియోగానీ తగ్గించి, సహజ ఎరువుల వినియోగాన్ని పెంచుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడాల్సిందిగా తెలియజేశారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు. సహజ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని తెలియజేశారు. నీటి యాజమాన్యంతో భాగంగా డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగం పెంచాలన్నారు. యాంత్రీకరణ ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని



పెంచుకుంటు పంట సాగు చేపట్టాల్సిందిగా ఆమె రైతులకు సూచించారు. మార్పులకు అనుగుణంగా పంట వైవిధ్య కరణ చేపట్టాలన్నారు. వచ్చే వానాకాలం సాగులో చేపట్టాల్సిన యాజమాన్యం రకాల ఎంపిక నాణ్యమైన విత్తనాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కె.విజయ్ గ్రామ సర్పంచ్ సవరమ్మ రామాంజనేయులు, అంకెంపల్లి సర్పంచ్ గొల్ల శ్రీనివాసులు, గొల్ల బాలు, నరేష్ రెడ్డి, సవరన్న ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఆదర్శ నియోజకవర్గమే లక్ష్యం

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, మే 6 (జనంసాక్షి) :** నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 14, 16వ వార్డుల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 14వ వార్డులో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. సామాజిక వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సౌకర్యార్థం ఇలాంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతరం నల్లకుంట చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. 16వ వార్డులో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కరిస్తామని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన

- సిద్దిపేట టు హనుమకొండ హైవే రోడ్డుపై బైఠాయించిన రైతులు
- పెద్ద ఎత్తున నిలిచిపోయిన వాహనాలు



**నంగునూరు, మే 6 (జనం సాక్షి) :** నంగునూరు మండల పరిధిలోని తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన రైతులు ప్రభుత్వం వెంటనే ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని, తాలు పేరుతో రైతులను వేధిస్తున్న మిల్లర్లను పై చర్యలు తీసుకోవాలని బుధవారం రోజు సిద్దిపేట నుండి హనుమకొండ వెళ్లే జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్పేట ఎస్సై వివేక్ ,పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి సంబంధిత అధికారులతో మాట్లాడించి రైతులను ఆందోళన విరమింప చేశారు. అనంతరం ఈ నిరసన కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులు కావస్తుంది. ఇప్పటివరకు రెండు లారీలు ధాన్యాన్ని క్లీన్ చేసి వ్యవసాయ అధికారి సెలెక్ట్ చేసి ధాన్యం సేకరించి మిల్లుకు పంపగా తాలు పేరుతో గత మూడు రోజులుగా ధాన్యం దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తా ఉన్నారు. గ్రామంలో మూడు రోజులుగా ధాన్యం కొనుగోలు నిలిపేశారు. ధాన్యాన్ని బి గ్రేడ్ లో సెలెక్ట్ చేసినప్పటికీ మిల్లర్లు ఇబ్బందులకు చేయడం చాలా బాధాకరమని , నిన్నటి రోజున రాత్రి కురిసిన వర్షానికి రైతులు చాలా అవస్థలు పడతా ఉన్నామని అన్నారు. ఈధర్నా కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలి



**సంగారెడ్డి, మే 6 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో కమర్షియల్, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లపై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం. తాజుద్దీన్ మాట్లాడుతూ.. కేంద్రం తన ఇష్టానుసారంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై భారీగా ధరలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని సిపిఐ కేంద్ర ప్రభుత్వన్నీ డిమాండ్. చేస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో గ్యాస్ చమురు ధరలు పెరుగుతే అట్టి భారాన్ని ప్రజలపై రుద్దుతుండడం ఏమిటని ప్రశ్నించారు. అంతర్జాతీయ మార్కెట్ లో గ్యాస్ చమురు ధరలు తగ్గినప్పుడు ఏమాత్రం జలలు తగ్గించకుండా తమకేమి తెలియనట్టు వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి షఫీ, సాధకలి, ముస్తఫా, యాకుబ్ అలీ ,పూలమ్మ ,తస్లిమ్ , గోరిబీ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య
- కర్చల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం



**రాయికోడు, మే 6 (జనం సాక్షి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నిటిని అర్హులందరూ సద్వినియోగపరచుకొని లబ్ధి పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ప్రముఖ న్యాయవాది జి అంజయ్య స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని ఖర్చల్ గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేదవాడి సొంతింటి కల నెరవేరిందన్నారు. రాయికోడ్ మండల అభివృద్ధికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. తదనంతరం ఉపాధి హామీ టి ఏ మురళి కూతురు కుమారుని నూతన వస్త్రధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్,మాజీ ఎంపీటీసీ బాబు కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పనిరాజ్, నాయకులు ఆర్ రాజు,సతీష్ కుమార్, నజీర్,రవిపాటిల్,శ్రీనివాస్, ఉమార్ ఖాన్, బాబా గౌడ్, లబ్ధిదారులు కావలి శివయ్య,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ పట్టణంలోని కేర్ హాస్పిటల్ సీజ్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లేశం



**మెదక్, మే 6 (జనం సాక్షి) :** నవజాత శిశువును విక్రయం చేసిన కేర్ హాస్పిటల్ పై కేసు నమోదు చేసి,హాస్పిటల్ ను సీజ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లాూూ యూనిస్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి, కార్యదర్శి వర్గ సభ్యులు కె నర్సమ్మ ఏ, మల్లేశం మాట్లాడుతూ శిశువును విక్రయం చేసిన కేర్ ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి, హాస్పిటల్ను సీజ్ చేయాలని మెదక్ పట్టణంలోని కేర్ హాస్పిటల్లో పుట్టిన శిశువు మృతి చెందిందని తల్లిదండ్రులను మోసం చేసి శిశువును విక్రయం చేసిన కేర్ ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి, హాస్పిటల్ను సీజ్ చేయాలని సిపిఎం మెదక్ జిల్లా కమిటీ కోరుతుందన్నారు. గత నెల 12వ తేదీన పాపన్నపేట మండలం లక్ష్మినగర్ కు చెందిన నస్రా ఫాతిమా డెలివరీ కోసం మెదక్ పట్టణంలోని కేర్ హాస్పిటల్లో అడ్మిట్ అయ్యారు. డెలివరీ వెళ్లిన శిశువు తల్లిదండ్రులకు పుట్టిన శిశువు మరణించిందని చెప్పి కోసం చేయడం జరిగింది. శిశువులను విక్రయించడం బి.ఎన్.ఎస్ సెక్షన్ 370, 372, 373 మరియు జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015 లోని సెక్షన్ 80, 81 ప్రకారం తీవ్రమైన నేరమని తెలిసినప్పటికీ హాస్పిటల్ యాజమాన్యం శిశువు విక్రయానికి ప్రోత్సాహించడం జరిగింది. ఈ నేరానికి పాల్పడిన వారిపై మరియు ప్రోత్సహించిన హాస్పిటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం కోరుతుందన్నారు. జిల్లాలో శిశువులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెంచాలని సిపిఎం వారు అన్నారు. మెదక్ పట్టణంతో పాటు నర్సాపూర్, తుప్రాన్, చేగుంట, రామాయంపేట, పెద్దశంకరం పేట ప్రాంతాల్లో ఉన్న ప్రయివేట్ హాస్పిటల్పై ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని,జిల్లాలో జరుగుతున్న శిశువు విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం మెదక్ జిల్లా కమిటీ కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జె సంతోష్ పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మే 6 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత



**చింతలమానేపల్లి మే 6( జనంసాక్షి) :** మండల కేంద్రంలోని బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బుధవారం రోజున మండలంలోని బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను పరిశీలించి హాజరు రిజిస్టర్ మందుల నిలువ గది ఆసుపత్రి పరిసరాలను ప్రాంతమును పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపతికి వచ్చే రోగికి సమయానికి సరియైన చికిత్స అందే విధంగా కృషి చేయాలని అన్నారు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆసుపతిలో సరిపడా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను ఉంచి ఎండ దెబ్బ తగిలిన వారికి వెంటనే చికిత్స అందించాలని అన్నారు గ్రామాలలోని ఆశా వర్కర్లు గర్భిణి స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు అనంతరం మండలంలోని దిందా గ్రామ సమీపంలో గల ప్రాణహిత నదిని పరిశీలించి దిందా గ్రామం వద్ద వాగుపై నిర్మిస్తున్న వంతెనను పరిశీలించి పనులను నాణ్యతతో నిర్మించాలని పేర్కొన్నారు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజు పనులను పర్యవేక్షించాలని సూచించారు ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి

- సీపీఐ రాస్తారోకో



**రామకృష్ణాపూర్, మే 06 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో క్యాతనపల్లి ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వలన వర్తక వాణిజ్య రవాణా సంస్థల పై భారం పెరిగి నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్యాస్ ధరలు పెరిగి మరోవైపు గ్యాస్ కొరత కారణంగా హోటల్ వ్యాపారులు దివాలా తీసే పరిస్థితి నెలకొందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు కొమ్ము కాయడం మానేసి పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని పెంచిన ధరలను తగ్గించాలని కోరారు. ఈ రాస్తారోకోలో కౌన్సిలర్లు మద్దెల శంకర్, ముని, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు కాదండి సాంబయ్య, మొండి, వనం సత్యనారాయణ, పౌల్, మామిడి గోపి, రవి, శ్రీనివాస్, రాజన్న, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

## ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, మే 6 (జనంసాక్షి) :** ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును పరిశీలించారు. గోదాములో ధాన్యపు డంపింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లారీలలో వచ్చిన దాన్యపు సంచులను ఎప్పటికప్పుడు భద్రంగా నిలువ చేయాలన్నారు. ఎక్కువమంది హమాలీలను నియమించుకొని వెంటవెంటనే ధాన్యపు సంచుల డంపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యపు సంచుల వివరాలు, అన్లోడింగ్ కు వరుసలో సిద్ధంగా ఉన్న లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటుచేసిన వరి, మొక్కజొన్న దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్ లు, తహసిల్దార్ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



**నిర్మల్ బ్యూరో, మే 06, (జనంసాక్షి) :** బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిర్మల్ జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వాహనాలను ఆపి పత్రాలు ఖచ్చితంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా పశువుల రవాణా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అక్రమంగా పశువుల రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించిన ఎస్పీ, చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణ కొనసాగించాలని, ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మంచి నీటి కోసం బావిలో పూడిక తీస్తుండగా

## మట్టి కూలి ఒకరు మృతి





**నూగూర్ వెంకటాపురం మే 6(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో ని సుడి బాక గ్రామం లో ఘోర విషాదం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఆదినారాయణ అనే వ్యక్తి మంచి నీటి కోసం బావిలో పూడిక తీస్తున్న క్రమంలో ఒక్క సారిగా బావి కుంగి మట్టి పెడ్డా పడటం తో బావి లోపల పూడిక తీస్తున్న ఆదినారాయణ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని జేసిబి సహాయం తో మట్టిని తొలగించి ఆదినారాయణ అనే వ్యక్తి ని బయటకి తీశారు. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. సుడిబాక గ్రామం లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటన పై పోలీస్ శాఖ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వానరాలకు వల..

- భూపాలపల్లిలో పలు చోట్ల బోన్లు ఏర్పాటు
- 'జనంసాక్షి' కథనానికి స్పందన..




భూపాలపల్లిలో వానరాల బెడద
కోతుల చేష్టలకు ఒకరు బలి
భయంతో పరుగులు తీసి కిందపడి వృద్ధుని మృతి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో వానరాలకు మున్సిపల్ చైర్మన్, అధికారులు వల విసిరారు. పట్టణంలోని పలు చోట్ల బోన్లు ఏర్పాటు చేసి కోతులను పట్టేస్తున్నారు. ఇటివలె కోతుల చేష్టలకు భయంతో పరుగులు తీసి కిందపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. కాగా ఈ విషయంపై 'భూపాలపల్లిలో వానరాల బెడద' పేరుతో 'జనంసాక్షి' మినీలో ఈ నెల 2న ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా 'జనంసాక్షి' కథనానికి స్పందించిన మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య నేతృత్వంలో అధికారులు వానరాలను పట్టుకునే పనిలో పడ్డారు. దీంతో భూపాలపల్లి పట్టణ ప్రజలు కొంత ఉపశమనం పొందుతున్నారు.

గత కొన్నేళ్లుగా భూపాలపల్లి పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఈ విషయంపై బాధిత ప్రజలు పదే పదే అధికారులకు ఫిర్యాదు చేసినా, అవి బుట్ట దాఖలయ్యాయి. కోతుల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ఆ వైపు చర్యలేమి తీసుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్ప లేదు. అధికారుల నిర్లక్ష్యం, వానరాల స్వైర విహారం వెరిసి ఒకరు ప్రాణాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుండడం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గుంపులు గుంపులుగా వానరాలు సంచరించడంతో స్థానిక ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకేవారు. ఎప్పుడూ, ఎవరి మీద కోతులు దాడి చేస్తాయో.. ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో రోజులను గడిపారు. కోతుల బెడదపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు అసహనానికి గురయ్యారు. వివిధ సమావేశాల్లో కోతులను పట్టిస్తామని చెప్పడం తప్పా ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో కోతులను పట్టించేందుకు తీర్మానాలు చేసినప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

పట్టణంలో రోజుకో చోట కోతుల దాడులు జరుగుతున్నా, నివారణ చర్యలు తీసుకోకపోవడంతో పట్టణ ప్రజల నుండి విమర్శలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే 'జనంసాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన మున్సిపల్ చైర్మన్, అధికారులు ఎట్టకేలకు కోతుల ఏరివేతకు ప్రయత్నాలు షురూ చేయడం మంచి పరిణామంగా చెప్పవచ్చు.

## తడిచిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**మహదేవపూర్, మే 6 (జనంసాక్షి) :** రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిచిన ప్రతి వడ్ల గింజను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మహదేవపూర్ మండలం సూరారం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.రాత్రి కురిసిన ఆకాల వర్షం వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించి రైతుల ముందు ముఖాముఖి మాట్లాడినారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యాన్ని తక్షణమే అన్నపూర్ణ పారా బాయిల్ రైస్ మిల్లు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా దిగుమతి ప్రక్రియలు ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలను నిలువ లేకుండా రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని. డిఎంకు సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని జాప్యం చేయవద్దని, రైతులకు ఇబ్బంది కాకుండా లారీ కాంట్రాక్టర్లు ట్రాన్స్పోర్ట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్.పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిఎం రాములు, ఎంపీడీవో రవీందర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, వామన్ రావు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.




## కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

- అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కో-ఆప్షన్ ఎన్నికల్లో జనరల్ కేటగిరీ కో-ఆప్షన్ సభ్యుడిగా సజ్జనపు స్వామి, మహిళా కేటగిరీలో చల్లా రేణుక, మైనారిటీ జనరల్ కేటగిరీలో ఎం.డి అబ్దుల్ హఫీజ్, మైనారిటీ మహిళా కేటగిరీలో ఎం.డి మిన్హాజ్ ఎన్నిక య్యారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు అంకితభావంతో, నిబద్ధతతో పని చేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్, డీసీసీ ప్రెసిడెంట్ బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో దొంగతనం

**మొగుళ్లపల్లి, మే 06 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామ శివారు తాటి వనంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు గౌడ కులస్తుడు మెరుగు బిక్షపతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ముప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీ రేణుక ఎల్ల మ్మ దేవాలయంలోకి ప్రవేశించి హుండీలో ఉన్న సుమారు 5వేల రూపాయల నగదును అపహరించినట్లు ఫిర్యాదుదారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ ముప్పు సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### రెడ్ క్రాస్ సొసైటీలో డైనింగ్ హాల్ భూమిపూజ,

## పరిపాలన భవనం ప్రారంభోత్సవం



**హనుమకొండ ప్రతినిధి, మే 6 (జనం సాక్షి) :** హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తలసేమియా బాధితుల కోసం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న డైనింగ్ హాల్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం హనుమకొండ రెడ్ క్రాస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని రెడ్ క్రాస్ మార్గ్ గా నామకరణం చేసి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రక్తదాన సేవలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్న రెడ్ క్రాస్ సేవలను అభినందించారు. తలసీమియా బాధితుల కోసం నిర్మించబడుతున్న డైనింగ్ హాల్ భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. డైనింగ్ హాల్‌ను నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు, మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కి రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ డైనింగ్ హాల్ నిర్మాణ భూమిపూజలో పాల్గొని, టైలరింగ్ సెంటర్, జనరిక్ మెడికల్ షాప్, రెడ్ క్రాస్ పరిపాలన భవనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ హెచ్. సంధ్యారాణి, బిళ్ళ రమణారెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి , రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వసంతోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- వైభవంగా నృసింహుడి వసంతోత్సవం
- ఉత్సాహంగా రంగుల కేళి
- అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు సక్సెస్





**మంగపేట, మే06(జనంసాక్షి) :** మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన పదవరోజు బుధవారం మల్లూరు క్షేత్రం పై కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల సతీసమేతుడు శ్రీ లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. వీరాస్వామి, దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు శ్రవణం సత్యనారాయణ తెలిపారు. మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 27 నుండి నుండి మే 06 వరకు పదిరోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ బ్రహ్మోత్సవాల క్రతువులను భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీ కృష్ణమాచార్యులు, వారి బృందం, యాజ్ఞకులు అమరవాది రామ నరసింహాచార్యులు, శ్రీపెరంబుదూరు మదన మోహనాచార్యులు, మణిదీపాచార్యులు, భరద్వాజాచార్యులు, సాయి వెంకటాచార్యులు, కారంపూడి శ్రీనివాసావిరంచిచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు చివరిరోజైనా బుధవారం ఉదయం 10 సమయంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల సతీస మేతుడు శ్రీ లక్ష్మీనరసింహుడి ఉత్సవమూర్తులను గజ వాహనంపై ఊరేగిస్తూ వసంతోత్సవ కార్యక్రమాన్ని వైభవపేతంగా అర్చకులు నిర్వహించారు. వసంతోత్సవ సందర్భంగా భక్తులపై రంగులు చల్లుతూ రంగుల కేళిని నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కన్నులారా చూడడం కొరకు భక్తులు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్గఢ్ రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాల మొదటిరోజు నుండి చివరిరోజు వరకు మంగపేట, చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం వీరస్వామి, దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకులు శ్రవణం సత్యనారాయణ, ఆలయ బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్ యర్రంగారి సురేష్, కమిటీ సభ్యులు పూజారి నరేందర్, పాయం అనిత, బోడ బొర్రయ్య, ఆలయ అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ, కారంపూడి పవనాకుమారాచార్యులు, ఏడునూతల ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, రాజీవ్ నాగశర్మ, ఆలయ సిబ్బంది నేతానీ సీతారాములు, శేషు, అజయ్, నవీన్, పుల్లయ్య, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
07 మే 2026

# రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

● జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, మే 6 (జనం సాక్షి) :** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4 నుండి నిర్వహిస్తున్న రైతు వారోత్సవం లో భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో మూడవ రోజైన బుధవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ రైతు వేదికలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కు జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ హాజరయ్యారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలు పండించాలని, ప్రత్యేకించి ఆయా భూములకు అనుకూలంగా ఉండే పంటలు పండిస్తే అధిక దిగుబడులతోపాటు, అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించిందని, ఆయా గ్రామాలలోని భూములకు అనుగుణంగా పంటలు వేసేందుకు జిల్లా యంత్రాంగం తరుపున అవసరమైతే ఒక డ్రైవ్ లా భూముల సారవంతం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. పండిన పంటకు పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని, మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని అన్నారు. రైతులు ఒకే పంటను పండించకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, కొత్తగా వస్తున్న మార్పులపై దృష్టి సారించి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా పంటలు పండించాలని చెప్పారు. ముఖ్యంగా పంటల సాగుతో పాటు, పండించిన పంటల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ వంటి సౌకర్యాలు వినియోగించుకొని పంటలు నిల్వ



చేసుకోవడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వరిలో ఎల్లప్పుడూ దొడ్డు బియ్యం కాకుండా, డిమాండ్ ఉన్న సన్న బియ్యం ఇతర రకాల ధాన్యాన్ని పండించాలని రైతులకు సూచించారు.రైతు సంక్షేమంలో భాగంగా తిప్పర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న భూమిని రైస్ మిల్ ఏర్పాటు చేసేందుకు సుముఖ వ్యక్తం చేసిన నేపథ్యంలో నాబార్డ్. అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలకు ఎలాంటి పాస్ పుస్తకాలు లేకుండా ఆన్లైన్లో భూభారతి వివరాల ఆధారంగా లోన్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సి ఈ ఓ ను ఆదేశించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ధాన్యం సేకరణను త్వరలోనే పూర్తి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. రైస్ మిల్లర్లు, లారీలు, వర్షం, తదితర కారణాలవల్ల కొనుగోలులో కొద్దిపాటి జాప్యం ఏర్పడిందని, మిల్లర్లు, హమాలీలు తదితర సమస్యలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ,ఆర్ అండ్ బి శాఖ మాత్యులతో మాట్లాడి చర్చించి సమస్యలన్నీ అధిగమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతంధాన్యం తరలించేందుకు 900 లారీలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేవలం 20 రోజులలో 3 లక్షల ఇరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ప్రతిరోజు ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్, సమీక్షలు నిర్వహిస్తున్నామని, ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని,ప్రస్తుతం మిల్లులలో అన్లోడింగ్ సమస్య లేదని తెలిపారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సహకార శాఖ సొసైటీల ద్వారా అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, ధాన్యం కొనుగోలు పై రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రితో పాటు ,జిల్లా కలెక్టర్ ప్రతిరోజు సమీక్షిస్తున్నారని, వారం, పది రోజుల్లో దాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, రైతులు ఎల్లప్పుడూ వరినే సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖ ద్వారా అందించే పథకాల పై రైతులకు అవగాహన కల్పించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు నాగరత్నరాజు, సహదేవరెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, ఎల్డిఎం శ్రామిక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు.జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



**అడ్డగూడూరు, మే 6 (జనం సాక్షి) :** అడ్డగూడూర్ మండల పరిధిలోని చిన్నపాడిశాల గ్రామానికి చెందిన రైతు లోడంగి మల్లయ్యకు చెందిన కాడెద్దు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. పశువుల పాక నుంచి తాడు తెంపుకొని వ్యవసాయ బావి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తూ విద్యుత్ వైర్లకు తగలడంతో ఎద్దు అక్కడికక్కడే చనిపోయింది.చనిపోయిన ఎద్దు చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఎద్దు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని, తనకు ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. అధికారులు స్పందించి పరిహారం ఇవ్వాలని కోరాడు.

## పైపులైన్ లీకేజీతో నీరు వృథా



**కొండమల్లేపల్లి, మే 6 (జనంసాక్షి) :** మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్లలో లీకేజీల వల్ల వేలాది లీటర్ల సురక్షితమైన తాగునీరు వృథా అవుతోంది. వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉన్నా కూడా అధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ కుంభం పుల్లారెడ్డి ఇంటికి ఎదురుగా సాగర్ నీటి పైపులైన్ లీకేజీతో వేసవికాలంలో విలువైన తాగునీరు రోడ్లపై పొలాల్లో మురుగు కాలువలో వృథాగా పోతోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాల్సిన పాలకులు, అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడడంలేదు గత 20 రోజుల నుండి సాగర్ పైపులైన్ లీకేజి అవుతున్నా ఎవరూ పట్టించుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంట సాగర్ నీటి సరఫరా పైపులు తరచూ మరమ్మతులకు గురవుతున్నా సమయానికి బాగుచేయడం లేదు. నీటి పథకాలపై సమీక్షించాల్సి ఉన్నా జరగడం లేదు. పైపులైన్ లీకేజీలు తాత్కాలికంగా మరమ్మతులు చేసినా శాశ్వత పరిష్కారం చూపకపోవడం వల్ల ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. సాగర్ పైపులైన్ల పేరుతో నిధులు విడుదలవుతున్నా వాటి నిర్వహణ సక్రమంగా లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా లీకేజీల వద్ద పైపులైన్లకు మరమ్మత్తులు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పాములపాడు పంచాయతీ కార్యదర్శి వింత పోకడ

● డిఎల్‌పిఓ ఆదేశాలను తుంగలో తొక్కే ప్రయత్నం..?
● డ్రైనేజీ కబ్జాపై చర్యలు శూన్యం బాధితుడికే నోటీసులా..?



**మాడుగులపల్లి, మే 6 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామంలో డ్రైనేజీ కబ్జా వ్యవహారం కొత్త మలుపు తిరిగింది అక్రమ కట్టడాలను తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి (డిఎల్‌పిఓ) నుండి స్పష్టమైన ఆదేశాలు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న పంచాయతీ కార్యదర్శి మాత్రం అక్రమార్కులకు కొమ్ముకాస్తూ, ఫిర్యాదుదారుడినే వేధించే ధోరణికి దిగడం స్థానికంగా కలకలం రేపుతోంది.

అధికారుల ద్వంద్వ వైఖరి

పాములపాడులో డ్రైనేజీని ఆక్రమించి గోడ నిర్మించినట్లు గతంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) జరిపిన విచారణలో తేలింది ఈ నివేదిక ఆధారంగా జిల్లా పంచాయతీ అధికారి గత నెల 22న మెమో (నెం: 676/2026/డీ4(2)) జారీ చేస్తూ, రెండు వారాల్లోగా ఆక్రమణలు తొలగించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు అయితే, గడువు ముగుస్తున్నా ఆక్రమణలు తొలగించకపోగా, ఫిర్యాదు చేసిన నంద్యాల అంబేద్కర్ కే నోటీసులు ఇస్తానని కార్యదర్శి అనడం అధికారుల అంతర్గత కుమ్మక్కునుబయటపెడుతోంది తప్పు చేసిన వారు రాజమార్గంలో బాధితులు ఇబ్బందుల్లో చట్టప్రకారం అక్రమ కట్టడాలను కూల్చివేయాల్సిన అధికారులు, అందుకు భిన్నంగా ఫిర్యాదుదారుడిని భయభ్రాంతులకు గురిచేయడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల మెమోలకే ఇక్కడ విలువ లేనప్పుడు, సామాన్యులకు న్యాయం ఎక్కడ దొరుకుతుందని బాధితుడు ప్రశ్నిస్తున్నారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి ద్వారా పోరాడి సాధించుకున్న ఆదేశాలను స్థానిక అధికారులు బుట్టదాఖలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది

### ప్రజా పక్షాన జనం సాక్షి

ప్రభుత్వ ఆస్తుల కబ్జాను అడ్డుకోవాల్సిన బాధ్యత కలిగిన అధికారులే, అక్రమార్కులకు రక్షణ కవచంలా మారడం సిగ్గుచేటు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, డి ఎల్ పి ఓ ఆదేశాలను అమలు చేయని కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే డ్రైనేజీ ఆక్రమణను తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి ఈ అక్రమాలను మరోసారి తీసుకెళ్తామని హెచ్చరిస్తున్నారు.

## సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

**మునుగోడు, మే 6 (జనం సాక్షి) :** జిల్లా రైతు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న సేవలను రైతులు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మునుగోడు మేనేజర్ రాగిణి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా బుధవారం మునుగోడు కేంద్రంలో రైతుకు వేదిక నందు మునుగోడు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్ రాగిణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ తోటి నారాయణ హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఐదు సహకార సంఘాల ద్వారా రైతులకు అందుతున్న సేవలను కార్యదర్శి పి సుఖేందర్ వివరించారు. ప్రతి గ్రామంలో రైతులకు పంట రుణాలు 2025- 26 సంవత్సరంలో దాదాపు 2016 మందికి గాను 36 కోట్ల 80



లక్షల రూపాయల రుణాలు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. సబ్సిడీ ద్వారా వస్తున్న వివిధ రకాల మొక్కలను పెంచి పంట దిగుబడి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ వేణుగోపాల్, ఎమ్మార్వో నరేష్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ జ్యోతిర్మయి, సీనియర్ ఇన్స్పెక్టర్ రమేష్, ఆడిటర్ రేణుక, కమలాకర్, ఏఎంసీ సెక్రటరీ రఘుపతి, ఉద్యానవన శాఖ విద్యాసాగర్, ఏవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపొద్దు

● జిల్లా ఎస్పీ వార్నింగ్

**నల్లగొండ ప్రతినిధి, మే 6 (జనం సాక్షి) :** జిల్లాలో భారీ వాహనాలు లారీలు కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం మరియు డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ హాజరై రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు మరియు డ్రైవింగ్‌లో పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధిక వేగం, అలసటతో వాహనం నడపడం మరియు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా బారి వాహనాల ప్రమాదాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, అందువల్ల డ్రైవర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ప్రతి డ్రైవర్ "డిఫెన్సివ్ డ్రైవింగ్" అలవాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.అంటే మనం సురక్షితంగా డ్రైవ్ చేయడమే కాకుండా, ఇతర వాహనదారుల పొరపాట్లను ముందుగానే అంచనా వేసి ప్రమాదాలను నివారించే విధంగా అప్రమత్తంగా వాహనం నడపడం. ఇది ముఖ్యంగా లారీలు వంటి బారి వాహనాలు నడిపే డ్రైవర్లకు అత్యంత అవసరమని చెప్పారు.ప్రతి ఒక్కరు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్



నియమాలను కచ్చితంగా అనుసరిస్తూ లైన్ డిసిప్లిన్ పాటిస్తూ,నిర్దేశిత వేగ పరిమితి పాటించాలని అన్నారు. వాహనాలు ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయకూడదని అన్నారు.అలాగే మెకానికల్ సమస్య, ఏ ఇతర సమస్యలు వచ్చి వాహనం రోడ్డుపై నిలిపివేయాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ కోన్స్, రిఫ్లెక్టర్ స్టిక్కర్లు, ఇండికేటర్లు ఉపయోగించి ఇతర వాహనదారులకు హెచ్చరిక ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జాతీయ రహదారి టోల్ ఫ్రీ నంబర్ 1033 కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.అలాగే డ్రైవర్లు ప్రతి రెండు గంటలకు ఒకసారి విశ్రాంతి తీసుకోవాలని,ప్రయాణానికి ముందు వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయాలి (బ్రేకులు, టైర్లు, లైట్లు, ఇండికేటర్లు) వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలపకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు.ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మరియు ప్రమాదాలు నియంత్రణకు బారి వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు అనుమతి ఉండదు అని తెలిపారు.ఈ సమయాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా మద్యం సేవించి డ్రైవింగ్ అధిక వేగం అనధికారిక పార్కింగ్ ఇలాంటి కేసుల్లో లైసెన్సుల రద్దు, వాహనాల సీజ్ వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి "రహవీర్ పథకం" కింద ప్రోత్సాహక నగదు అందజేయబడుతుందని తెలిపారు. మొదటిసారి - రూ. 25,000, రెండోసారి - రూ. 50,000, మూడోసారి - రూ. 1,00,000 ప్రోత్సాహకం అందుతుందని వెల్లడించారు.మీ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా ప్రతి డ్రైవర్ జాగ్రత్తగా వ్యవహరించాలి. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ సీఐ ఆదిరెడ్డి, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, డిటిఆర్బి రిటైర్డ్ సీఐ అంజయ్య, మిర్యాలగూడ లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చాంద్ పాషా, సెక్రటరీ రవీందర్ రావు, డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి



**తెలకపల్లి, మే 6 (జనం సాక్షి) :** పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ తెలకపల్లి మండల సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ మరియు డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ (ఎల్పీజీ) ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు.ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతోందని సామాన్య ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దేశామోని ఆంజనేయులు, సిపిఐ మండల నాయకులు బుగ్గ స్వామి, బిచ్చయ్య, నారాయణ సత్తి కృష్ణ రెడ్డి, బాల పీరు, కుర్మయ్య ,అలివేల,తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి స్టేట్ టాపర్స్‌ను అభినందించిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం, మే 6 (జనంసాక్షి) :** ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయి లో 595 మార్కు లు సాధించిన త్రివేణి విద్యార్థిని ఎల్. నేహా, 586 మార్కులు సాధించిన హరిచందన, హర్షవర్ధన్, 585 మార్కులు సాధించిన దేవీ వెంకట సాయి, 583 మార్కులు సాధించిన రోహన్ సాయి, అఖిల్,582 మార్కులు సాధించిన శ్యామ్ శ్రీ, రిషిత, 581 మార్కులు సాధించిన సాయి దీక్షిత్, రోహిత్ కృష్ణ,తదితర రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను స్థానిక రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా త్రివేణి విద్యార్థులు దిన దిన ప్రవర్ధమానం గా వెలుగొందాలని, విద్యార్థులందరినీ అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లాలని, ఆవిధంగా వారిని తీర్చిదిద్దాలని యాజమాన్యానికి సూచించారు. విద్యార్థిని విద్యార్థులను మంత్రి అభినందించడం పట్ల పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి హర్షం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 6 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రం లోని ఆర్టీసీ బస్టాండ్ ఎదు రుగా ఉన్న ఈవీఎం గోదా మును త్రైమాసిక తనిఖీలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక తనిఖీ చేశారు.ఈవీఎం గోదాము పరిసరాలను చూసి భద్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, ఆర్డీవో రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

● శాసనసభ్యులు మందుల సామేలు



**తుంగతుర్తి, మే 6 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్ కు లేదని ఇప్పటికైనా చిల్లర మాటలు మానుకొని హుందాగా మాట్లాడాలని స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు విలేకరులతో మాట్లాడారు. గత బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో లూటీ చేసి ఆర్థికంగా అప్పుల ఊబిలో నెట్టిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులను నయవంచన చేసిన బిఆర్ఎస్ నాయకులే నేడు రైతు సమరభేరి పేరుతో సభలు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు, కేటీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదని అన్నారు. ఈ మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా నాయకులు రేగటి రవి, వివిధ మండలాల సర్పంచులు,అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రుగొండ పీహెచ్సీ ఆకస్మిక తనిఖీ



**చంద్రుగొండ, మే 6 (జనం సాక్షి) :** చంద్రుగొండ మండలంలోని చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు.ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ మరియు ఔట్‌పేషెంట్ విభాగాలను సందర్శించిన కలెక్టర్, చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలు, వైద్యుల అందుబాటు, మందుల సరఫరా వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, సిబ్బంది హాజరు, విధుల్లో ఉన్న డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది సంఖ్యపై వివరాలు తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల విషయమై అధికారులను ప్రశ్నించారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలు, స్టాక్ పరిస్థితి, అవసరమైన మందుల సరఫరా స్థితిపై ఆరా తీశారు. ముఖ్యంగా అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ సేవలపై కూడా సమగ్రంగా పరిశీలించిన ఆయన, పరీక్షలకు అవసరమైన పరికరాలు, ల్యాబ్ సదుపాయాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసూతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, గర్భిణీలకు అందిస్తున్న సేవలు, సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ఆపరేషన్ల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోమియో వైద్యశాలలో హోమియో డాక్టర్ అందుబాటులో లేరని అధికారులు తెలపగా, ఆ పోస్టును త్వరలోనే భర్తీ చేసి సేవలు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు మరియు సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను పాటిస్తూ, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి రాము, తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విపణి




## శాంసంగ్.. 1 ట్రిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ షేర్లు భారీగా పెరిగాయి. బుధవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 15శాతం పెరగడంతో.. మార్కెట్ విలువ 1 ట్రిలియన్ డాలర్ల (రూ.95 లక్షల కోట్లకు పైగా) మార్క్‌ను దాటి పరుగులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీ అంతకంతకూ విస్తరిస్తున్న నేపథ్యంలో మెమొరీ చిప్‌లకు భారీగా డిమాండ్ పెరుగుతుండడంతో శాంసంగ్ భారీగా లాభాలను దక్కించుకుంటోంది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ తర్వాత ఈ మార్కును చేరిన రెండో ఆసియా కంపెనీగా ఇది నిలిచింది. రాబోయే 12 నెలల్లో ఈ స్టాక్ సుమారు 30 శాతం పెరుగుతుందని బ్లూమ్‌బర్గ్ నివేదికలు పేర్కొంటున్నాయి. శాంసంగ్ సెమీకండక్టర్ విభాగం మార్చి త్రైమాసికంలో అంచనాలను మించి 48 రెట్ల చారిత్రక లాభాన్ని ఆర్జించింది. ఏఐ డేటా సెంటర్ ఆర్డర్లు భారీ మార్జిన్లను అందించడమే దీనికి కారణం. పరిమిత సరఫరా మధ్య కాంట్రాక్ట్ ధరలు మరింత వేగంగా పెరుగుతుండడంతో రాబోయే పలు త్రైమాసికాలలో ఈ విభాగం తన రికార్డు స్థాయి లాభాన్ని మరింత పెంచుకుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ మార్కెట్‌లో అధునాతన చిప్‌లు, కంప్యూటింగ్ సామర్థ్యానికి నిరంతరం డిమాండ్ పెరుగుతుండడంతో ఎస్కే హైనిక్స్, టీఎస్ఎంసీ వంటి ఇతర మెమొరీ సంస్థల షేర్లు కూడా ఈ నెలలో రికార్డు స్థాయి గరిష్టాలకు చేరుకున్నాయి.




### ఎఫ్‌డీఐలపై 12 వారాల్లో నిర్ణయం

అమెరికాలో తన డివైజ్‌ల కోసం ప్రధాన ప్రాసెసర్‌లను ఉత్పత్తి చేయడానికి శాంసంగ్‌ను ఉపయోగించుకోవడంపై యాపిల్, ఆ సంస్థతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం మెమొరీ మార్కెట్‌లో సరఫరా కొరత ఉందని జూపిటర్ అసెట్ మేనేజ్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ సామ్ కొన్రాడ్ పేర్కొన్నారు. ఈ ఏడాదితో పోల్చితే 2027లో దీని డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

# ఆఖర్లో అద్భుతం

## దూసుకెళ్లిన సూచీలు.. 24,300 పైకి నిఫ్టీ

**ముంబయి:**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెరించేలా అమెరికా, ఇరాన్ దేశాలు ఒక ఒప్పందానికి చేరువయ్యాయన్న వార్తలు మార్కెట్‌లో ఉత్సాహానికి కారణమయ్యాయి. ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ కూడా దాదాపు 9 శాతం క్షీణించి 100 డాలర్లకు చేరువ అవ్వడం మరింత కలిసొచ్చింది. దీంతో ఉదయం లాభనష్టాల మధ్య కదలాడిన సూచీలు.. చివరి గంటలో దూసుకెళ్లాయి. మదుపర్ల సంపద సుమారు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,424.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,017.79) లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి దాదాపు 800 పాయింట్లు క్షీణించింది. అమెరికా- ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన వార్తలు రావడంతో సూచీ పుంజుకొంది. చివరికి 940.73 పాయింట్ల లాభంతో 77,958.52 వద్ద ముగిసింది. నిఫ్టీ 298.15 పాయింట్ల లాభంతో 24,330.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలపడి 94.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో ఏకంగా 6 శాతం మేర దూసుకెళ్లింది. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. రిలయన్స్, ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద ట్రేడవుతండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## మహీంద్రా అండ్ మహీంద్రా లాభం రూ.5,260 కోట్లు

**న్యూఢిల్లీ:**వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, మార్చి త్రైమాసికంలో రూ.5,259.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,541.85 కోట్లతో పోలిస్తే ఇది 48.5% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.39,113.61 కోట్ల నుంచి రూ.49,615.48 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ లాభం రూ.18,621.71 కోట్లుగా నమోదైంది. 2024-25 లాభం రూ.14,073.17 కోట్ల కంటే ఇది 32.32% అధికం. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,58,749.75 కోట్ల నుంచి రూ.1,97,792.78 కోట్లకు చేరింది. రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.33 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. విభాగాల వారీగా: మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు 21% పెరిగి 3.07 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2025-26లో ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ట్రాక్టర్ల విభాగంలో కంపెనీ మార్కెట్ వాటా 43.6 శాతానికి పెరిగింది. 2025-26లో 5 లక్షలకు పైగా ట్రాక్టర్ల బిల్లింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించింది. భవిష్యత్తు అంచనాలు, ప్రణాళికలు: 2031 నాటికి 10 కొత్త ఐసీఈ ఎస్‌యూవీలు, 6 కొత్త విద్యుత్తు వాహనాలను తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాదిలో ట్రాక్టర్ పరిశ్రమ స్వల్ప వృద్ధి నమోదు చేయొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,38,700 | ₹ 1,51,310 |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,70,000

### ప్రీమియం ప్లాన్‌ల కోసం జియో, ఎయిర్‌టెల్

## 'స్లైసింగ్' వ్యూహం!

దేశంలో ప్రముఖ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్ ప్రీమియం ప్లాన్‌లను తీసుకొచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇందుకోసం టెలికాం నియంత్రణ సంస్థ నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. జియో ఇప్పటికే ఈతరహా ప్రయత్నాలు మొదలుపెట్టగా.. తాజాగా ఎయిర్‌టెల్ కూడా అదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం నెట్‌వర్క్ 'స్లైసింగ్' సాంకేతికతను వినియోగించడానికి సిద్ధమవుతోంది. ఇంతకీ ఏమిటీ సాంకేతికత? భారత్‌లో దీనికున్న అడ్డంకులేంటి?ప్రస్తుతం టెలికాం కంపెనీలు 4జీ ధరలకే 5జీ సేవలను అందిస్తున్నాయి. దీంతో ఆశించిన ఆదాయం రావడం లేదనేది కంపెనీల వాదన. 5జీ స్పెక్ట్రమ్ కొనుగోలు, ఆ మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసిన ఖర్చును తిరిగి రాబట్టాలంటే.. ప్రీమియం సర్వీసులు అందించడం ఒక్కటే మార్గమని టెల్కోలు భావిస్తున్నాయి. ఇందులోభాగంగా ఎయిర్‌టెల్ తన ఆదాయాన్ని పెంచుకునేందుకు 'నెట్‌వర్క్ స్లైసింగ్' సాంకేతికతను ఉపయోగించి ప్రీమియం ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

**ఏమిటీ నెట్‌వర్క్ స్లైసింగ్?**

ఒకే ఫిజికల్ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలపై బహుళ వర్చువల్ నెట్‌వర్క్‌లను సృష్టించడం ఈ సాంకేతికత ఉద్దేశం. ఒక్కో 'స్లైస్' ఒక్కో నిర్దిష్ట అవసరానికి తగ్గట్టుగా పనిచేస్తుంది. ఉదాహరణకు హై-స్పీడ్ గేమింగ్ కావాలనుకునే వారికి ఒక స్లైస్, వీడియో స్ట్రీమింగ్ కోసం ఒకటి.. ఎంటర్‌ప్రైజ్ అవసరాల కోసం మరొకటి అన్నమాట. అంటే మీరు హైస్పీడ్ డేటా వేగంతో గేమింగ్ ఆడాలనుకుంటే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నమాట. ఇలా 5జీ నెట్‌వర్క్‌ను నిర్దిష్ట కస్టమర్ల అవసరాలను తీర్చడానికి వినియోగించొచ్చు. ఇప్పటికే రిలయన్స్ జియో 5జీ నెట్‌వర్క్ ఆధారిత ప్రీమియం సర్వీసులను తీసుకొచ్చేందుకు ట్రయల్స్ మొదలుపెట్టింది. క్లౌడ్ గేమింగ్ కోసం ప్రత్యేక ప్లాన్ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇదే మాదిరిగా ఎయిర్‌టెల్ కూడా ఇందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తోంది. మెరుగైన వేగం, తక్కువ లేటెన్సీ కోరుకునే వారి కోసం ప్రీమియం ధరలతో ప్రత్యేక ప్లాన్‌లు అందించాలని చూస్తోంది. దీనివల్ల టెల్కోల ఆదాయం 20-30 శాతం పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



**నెట్ న్యూట్రాలిటీ అడ్డంకి**

ప్రస్తుతం చైనా, ఫిన్లాండ్ వంటి దేశాల్లో ఇలాంటి స్పీడ్ ఆధారిత ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే, భారత్ విషయానికొచ్చేసరికి నెట్ న్యూట్రాలిటీ నిబంధనలు ప్రతిబంధకంగా మారనున్నాయి.

# అమెరికా నౌకల పైకి.. ఇరాన్ ఆత్మాహుతి 'డాల్ఫిన్లు'

**వాషింగ్టన్:**అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు తమ యుద్ధనౌకలు జలసంధిలోకి వెళతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలో అగ్రరాజ్య యుద్ధ నౌకల పైకి మైన్లను మోసుకెళ్లే డాల్ఫిన్లను ప్రయోగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఇరాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రకటన ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేసింది. చివరకు దానిపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పందించాల్సి వచ్చింది. అమెరికా వద్ద కామికాజి డాల్ఫిన్లు (ఆత్మాహుతి డాల్ఫిన్లు) ఉన్నాయా..? లేదా..? అనే అంశాన్ని తాను కచ్చితంగా చెప్పలేనని హెగ్సెత్ వెల్లడించారు. అయితే, ఇరాన్ వద్ద మాత్రం అలాంటివి ఏవీ లేవని చెప్పారు. మరోవైపు ఛైర్మన్ ఆఫ్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కథనాలను తోసిపుచ్చారు. ప్రతిధ్వనుల సాయంతో నీటి అడుగున వస్తువుల జాడను (సోనార్) డాల్ఫిన్‌లు స్పష్టంగా గుర్తించగలవు. ఈ సహజ లక్షణం కారణంగా శత్రువులు నీటి అడుగున దాడికి వినియోగించే వస్తువులు ఏమైనా పెట్టి ఉంటే వాటిని వెంటనే పసిగట్టగవు. డాల్ఫిన్ (ఆనీశ్రీజూష్ట్రతినిబ)లకు ఇటువంటి వాటిపై శిక్షణ ఇవ్వడమే కాకుండా ప్రత్యేకంగా రూపొందించిన పరికరాలు, కెమెరాలను అమర్చి సముద్రం అడుగున పరిస్థితులను పర్యవేక్షించవచ్చు. తద్వారా శత్రువుల కదలికలను ముందుగానే గుర్తించే ఆస్కారం ఉంటుంది. రష్యా సైన్యానికి సెవాస్తొపోల్ నౌకా స్థావరం ఎంతో కీలకమైనది. రష్యా నియంత్రణలోని క్రిమియాకు ఈ స్థావరం అత్యంత చేరువలో ఉంటుంది. ఈ ప్రదేశంలోనే మాస్కోకు చెందిన భారీ నౌకలు నిలిచిఉంటాయి. క్షిపణులు సైతం చేరుకోలేని ఈ ప్రదేశంలో కూడా నీటి అడుగున దాడులు జరిగే ప్రమాదం ఉన్నట్లు రష్యాకు అనుమానాలు ఉన్నాయి. అలాంటి దాడులేవీ జరగకుండా తమ నౌకలను రక్షించుకోవడమే కాకుండా శత్రువుల కదలికలను ముందుగానే గుర్తించేందుకు సైతం డాల్ఫిన్లకు శిక్షణ ఇచ్చి రంగంలోకి దింపినట్లు గతంలో వార్తలు వచ్చాయి. తమవద్ద ఇలాంటి డాల్ఫిన్లు లేవని అమెరికా చెప్తున్నప్పటికీ.. కోల్డ్‌వార్ సమయంలోనూ అమెరికా, సోవియట్ యూనియన్ (ఈ యూనియన్ విచ్ఛిన్నమై రష్యా సహా 15 దేశాలుగా విడిపోయింది) సముద్రం అడుగున పేలుడు పదార్థాల కదలికలను గుర్తించేందుకు వీలుగా డాల్ఫిన్లకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టినట్లు గతంలో పలు అధ్యయనాలు వెలువడ్డాయి. అమెరికా సైన్యం 1959 నుంచే ఇటువంటి శిక్షణ ఇస్తోందని.. వివిధ సముద్ర ప్రాణులపై ప్రయోగాలు చేసినప్పటికీ డాల్ఫిన్‌లు, కాలిఫోర్నియా సీ లయన్‌లకు మాత్రమే ఇటువంటి శిక్షణ అందిస్తోందని పేర్కొన్నాయి. ఇందుకోసం అమెరికా మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోందని సమాచారం. శత్రుదేశాల జలాంతర్గాములను గుర్తించే సామర్థ్యాన్ని కలిగిన డాల్ఫిన్లను సోవియట్ యూనియన్ నుంచి ఇరాన్ కొనుగోలు చేసినట్లు గతంలో ప్రచారం జరిగింది. ప్రపంచ రవాణాకు కీలకమైన హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ఈ సమయంలో ఈ డాల్ఫిన్ల అంశం మళ్లీ తెర పైకి వచ్చింది.





## ఒబామా సంసారంలో ట్రంప్ రచ్చ!



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భార్యా పిల్లలతో సుఖంగా కాలం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కుటుంబంలో రచ్చకు కారణమవుతున్నారా? అవునని స్వయంగా ఒబామా ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంగీకరించారు. ఒకవైపు ట్రంప్ పరిపాలన సాగించినంతకాలం క్రియాశీల రాజకీయాల్లో కొనసాగాలని ఒబామాపై డెమోక్రటిక్ పార్టీ ఒత్తిడి చేస్తోంది. మరోవైపు ఆయన భార్య మిషెల్ ...చేసింది చాలు ఇక రాజకీయాలు మనకొద్దని అంటున్నారు. ఒకవైపు పార్టీ, మరొకవైపు భార్య మధ్య సతమతమవుతున్నారు ఒబామా. "శేష జీవితంలో భర్త మరింత సమయాన్ని తన కోసం కేటాయించాలని ఆమె కోరుకుంటున్నారు. ఇది మా సంసారంలో ఉద్రిక్తతకు దారితీస్తోంది. ఆమె నిరాశకు గురవుతున్నారు" అని ఒబామా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు సాధారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ఒబామా కూడా అలాగే ఉండేవారు. ఆయన పనితీరుపై ఎలాంటి వ్యాఖ్యలూ చేసేవారు కాదు. అయితే కాలం గడిచే కొద్దీ ట్రంప్ విధానాలపై మాజీ అధ్యక్షుడు విమర్శలు గుప్పించడం ప్రారంభించారు. దేశ అధ్యక్ష పదవిని వదిలి 16 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా పార్టీ కోసం పనిచేస్తున్న అరుదైన డెమోక్రటిక్ పార్టీ నేతల్లో ఒబామా ఒకరు.

## ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచుతున్న రిలయన్స్

### ఆల్కలైట్స్ ఎగుమతుల్లో కోత


**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఏర్ప డిన సరఫరా అంతరాయాల వల్ల మనదేశంలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ)కు కొరత ఏర్పడు తోంది. అందుకే ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచడంపై దృష్టి సారించిన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇందుకోసం ఆల్కలైట్స్ ఉత్పత్తిని తగ్గించుకుంటోంది. గ్యాసోలైన్‌లో మిశ్రమంగా ఆల్కలైట్స్‌ను వాడతారు. రిలయన్స్ తన రిఫైనింగ్ కాంప్లెక్స్‌లో ఆల్కలేషన్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ఉత్పత్తి చేసిన ఆల్కలైట్స్‌ను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచేందుకు ఆల్కలైట్స్ ఎగుమతులను రిలయన్స్ ఇండస్ట్రీస్ తగ్గించుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందున్న పరిస్థితులతో పోలిస్తే, ఎల్‌పీజీ ఉత్పత్తి మూడింతలకు పైగా పెరిగినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చెబుతోంది. దీంతో పశ్చిమాసియా దేశాల నుంచి తగ్గిన ఎల్‌పీజీ దిగుమతుల్లో కొంత మేర భర్తీ చేయగలిగామని కంపెనీ పేర్కొన్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. రోజుకు 6.60 లక్షల బ్యారెళ్ల ముడిచమురును శుద్ధి చేయగలిగిన తన రిఫైనరీ కాంప్లెక్స్‌లో ఉన్న క్రూడ్ యూనిట్, మరికొన్ని అనుబంధ యూనిట్లను వార్షిక నిర్వహణ పనుల కోసం కొంతకాలం మూసివేసే యోచనలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల మధ్య నుంచి 3-4 వారాల పాటు ఈ యూనిట్లలో కార్యకలాపాలు ఆపేయనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే దేశంలో ఇంధన కొరత సమస్య తలెత్తకుండా, నయారా ఎనర్జీ రిఫైనరీ కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాక ఈ యూనిట్లలో కార్యకలాపాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ నిలిపి వేస్తుందని వెల్లడించాయి.




## భానుడి భగభగలతోనూ మేలే

### ఇస్రో ఏం చెప్పిందంటే..?

**న్యూఢిల్లీ:**సూర్యుడి భగభగలకు మనుషులతోపాటు భూమిపై జీవరాశి మలమలమాడిపోతోంది. వేడిని తాళలేక వర్షాలు ఎప్పుడు కురుస్తాయా..? అని ఎదురు చూస్తోంది. అలాంటి భానుడు తన తీవ్ర ఉష్ణోగ్రతలతో మేలు చేస్తాడంటు న్నారేం టని అనిపిస్తోంది కదా..! ఇంతకీ ఇస్రో తన అధ్యయనంలో ఏం గుర్తించిం దంటే..?విశ్వాన్ని శోధించేందుకు ప్రపంచవ్యాప్తంగా పలు అంతరిక్ష సంస్థలు శాటిలైట్‌లను పంపిస్తున్నాయి. అవి రోదసిలోకి వెళ్లిన తర్వాత విఫలం కావొచ్చు.. గడువు తీరిన తర్వాత పనిచేయడం ఆగిపోవచ్చు. దాంతో భవిష్యత్ యాత్రలకు అవి ఆటంకం కలిగించకుండా వాటిని తొలగించడం ఒక సవాలే. అయితే సౌరమండలంలో ఉష్ణోగ్రతలు, అయస్కాంతక్షేత్రాల ప్రభావంతో ఈ శిథిలాలు భూ కక్ష్య నుంచి తొలగిపోతున్నాయని ఇస్రో అధ్యయనంలో గుర్తించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్తలు 17 శిథిలాలను 34 ఏళ్ల పాటు పరిశీలించారు. సోలార్ యాక్టివిటీకి.. అంతరిక్ష వ్యర్థాల గమనానికి మధ్య సంబంధం ఉందని ఎప్పటినుంచో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వారి భావనను ధ్రువీకరించిన తొలి అధ్యయనం ఇస్రోదే కావడం గమనార్హం. సూర్యుని భ్రమణ ప్రారంభదశలో సౌర జ్వాలలు తక్కువగా ఉంటాయి. తర్వాత అవి అత్యంత చురుకుగా మారుతుంటాయి. అలా సోలార్ యాక్టివిటీ పెరిగిన సమయంలో సన్ స్పాట్స్ సంఖ్య పెరిగి, భారీగా రేడియేషన్ బయటకు వెలువ డుతుంది. దాంతో భూవాతావరణంలోని పైపొర థర్మోస్ఫియర్ వేడెక్కడంతో అది విస్తరిస్తుంది. దాంతో భూమికి 160కి.మీ. నుంచి 2000కి.మీ. ఎత్తులో ఉన్న శిథిలాలు దట్టమైన గాలిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ కారణంగా వాటి పరిభ్రమణం మందగిస్తుంది. అది వాటిని దిగువ కక్ష్యలోకి లాగి, భూమివైపునకు పడిపోయేలా చేస్తుంది. సూర్యుడు చురుగ్గా ఉన్నప్పుడు భూమి చుట్టూ ఉన్న శిథిలాలు వేగంగా తమ ఎత్తును కోల్పోతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 1986 నుంచి 2024 మధ్య మూడు సోలార్ సైకిల్స్‌ను వీరు గమనించారు. రోదసి కార్యకలాపాల వల్ల ఈ వ్యర్థాలు పెరిగిపోతున్న సమయంలో భానుడు ఇలా వాటిని సహజంగా తొలగించడం మేలు చేస్తుందని, అంతరిక్ష సంస్థలు తమ శాటిలైట్లను సురక్షిత సమయాల్లో లాంచ్ చేయడానికి వీలు కలుగుతుందని చెప్తున్నారు.



## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

### బత్తిన కుటుంబ సభ్యుల ప్రకటన

హైదరాబాద్(జనంసాక్షి):ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అందించే చేప ప్రసాదం పంపిణీ జూన్ 8న ప్రారంభించనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఉబ్బసం, శ్వాస కోస వ్యాధులను వివారించేందుకు ఉచితంగా అందించే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని బత్తిని మృగశిర ట్రస్టు నిర్వాహకులు, దివంగత బత్తిని హరినాథ్ కొడుకు అమర్నాథ్ గౌడ్ తెలిపారు. జూన్ 8వ తేదీన తమ కుటుంబ సభ్యులు చేప ప్రసాదం సేవించిన తర్వాత సాయంత్రం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానానికి తరలించనున్నట్లు తెలిపారు. ముహూర్తం ప్రకారం అదేరోజు రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. చేప ప్రసాదం పంపిణీకి ఇప్పటికే ఫిషరీ డిపార్ట్‌మెంట్ ఎగ్జిబిషన్ గ్రౌండ్, పోలీస్ డిపార్ట్‌మెంట్ ,జీహెచ్ఎంసీ, ప్రభుత్వం పర్మిషన్ తీసుకున్నామని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్, అనిరుధ్ గౌడ్, దుర్గా గౌడ్ మంగళవారం తెలిపారు. సుమారు 180 ఏండ్లకు పైగా చేప ప్రసాదం పంపిణీ జరుగుతోందని, ఎక్కడా ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌తో పాటు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు శతాబ్దాలుగా బత్తిని కుటుంబం చేపప్రసాదం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాశ సంబంధ వ్యాధుల నివారణకు మృగశిర కార్తె ప్రవేశించిన ఘడియల్లో ఓ పదార్థాన్ని చేప ద్వారా నోటిలో వేస్తామని ఆయన పేర్కొన్నారు.

## రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న పంపిణీ

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం మరోసారి భరోసానిచ్చింది. మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, సేకరించిన ధాన్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు రేషన్ దుకాణాల ద్వారా నేరుగా పేద ప్రజల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పంటలను బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపుల లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. పంట పండించిన రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో మొక్కజొన్న, జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు ఈ పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. సాధారణంగా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తుంది. దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా మిగిలిపోకూడదు.. అది పేదవాడి ఆకలి తీర్చి, పౌష్టికాహారంగా మారాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ది చేకూరనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా మొక్కజొన్న, జొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఐఐటీ-జెఈఈ (మెయిన్)లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతం

- బి.ఆర్చ్‌లో 174 ర్యాంకు సాధించిన ఎస్. శ్రీహిత
- బి.ప్లానింగ్‌లోనూ మెరుగైన ఫలితాలు
- ఐఐటీ అడ్వాన్స్‌కు సన్నాహాలు



**కరీంనగర్ బ్యూరో, మే 06 (జనంసాక్షి) :** ఐఐటీ - జెఈఈ (మెయిన్) బి.ఆర్చ్, బి.ప్లానింగ్ 2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి సంస్థకు కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బి.ఆర్చ్‌లో ఎస్. శ్రీహిత 174వ ర్యాంకుతో అత్యున్నత స్థానం సాధించగా, పటేల్ అక్షయ 189వ, డి. తనుశ్రీ 227వ, వి. రితిక 287వ, ఎస్. ఆధ్య 319వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇక టి. వెంకట్ నిహిత్ 903, సి.హెచ్. భీమ 1107, ఆర్. నేహగాయత్రి 1719, పి. శ్రీనిధి 1776, పి. హర్షిణి 2325, ఉమైరా సన్నున్ 2626, పి. అక్షయప్రియ 2786 ర్యాంకులు సాధించారు. బి.ప్లానింగ్‌లో వి. ప్రణతి 858వ ర్యాంకు, పి. క్రిష్ 1281వ, ఎం. వివేక్ రెడ్డి 1554వ, ఎం. షాలిని 1757వ, రహీన్ ఉమేద్ 2448వ, జి. మహాలక్ష్మి 3053వ, పి. ఆదిత్యలక్ష్మి 3122వ ర్యాంకులు సాధించారు. రాబోయే ఐఐటీ (అడ్వాన్స్) పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందం శిక్షణ ఇస్తోందని, పటిష్ట ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల, అహర్నిషల కృషి వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని చైర్మన్ వి. నరేందర్ రెడ్డి వివరించారు. ఐఐటీ అడ్వాన్స్‌లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించి ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మనస్ఫూర్తిగా అభినందించిన చైర్మన్, ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# కోటి ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్

- వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం భారీ ఊతం
- 7 జిల్లాల చేనేత సంఘాలకు కోటి చీరల పంపిణీ
- గడువులోగా నాణ్యతతో డెలివరీ చేయాలి



**రాజన్న సిరిసిల్ల, మే 06 (జనంసాక్షి):** రాష్ట్రంలోని ఏడు జిల్లాల వస్త్ర పరిశ్రమలకు ప్రజా ప్రభుత్వం కోటి ఇందిరా మహిళా శక్తి నూతన చీరల ఆర్డర్‌ను అందజేసింది. గత ఏడాది 6 కోట్ల 85 లక్షల చీరల ఆర్డర్ ఇచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం కోటి చీరల ఆర్డర్ ఇచ్చిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన రంగుల చీరలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు.
ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఆర్డర్ ద్వారా వస్త్ర పరిశ్రమకు ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలకు 60 లక్షలు, పట్టణాలకు 35 లక్షలు, గోచి చీరలు 5 లక్షలు మొత్తం కోటి చీరల ఆర్డర్ ఇచ్చారు. ఇందులో 95 లక్షల చీరలు (6.3 మీటర్లు), 5 లక్షల చీరలు (9 మీటర్లు) ఉన్నాయి.
గత ఆర్డర్‌లో బకాయి ఉన్న 352 కోట్ల రూపాయలు విడుదల చేశామని, గడువులోగా నాణ్యమైన చీరలు డెలివరీ చేయాలని వస్త్ర పరిశ్రమ యజమానులను కోరారు. వేములవాడలో రూ.50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసి 90 శాతం క్రెడిట్‌పై యార్న్ అందిస్తున్నట్లు తెలిపారు. నేతన్నలకు రూ.5 లక్షల బీమా, చేనేత కార్మికుల రుణమాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి చీరలు నాణ్యతలో ఉత్తమంగా ఉన్నాయని, రానున్న ఆర్డర్లలో కూడా అదే నాణ్యతను కొనసాగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, స్థానిక చీరలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, చేనేత శాఖ అధికారులు, వివిధ జిల్లాల వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు పాల్గొన్నారు.

# మంథనిలో టాస్క్ సెంటర్ ప్రారంభోత్సవం

- అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్-ఎస్ఆర్ కృష్ణ 3డీ ఆర్ట్
- మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీకృష్ణ అభినందన



**మంథని, మే 06 (జనంసాక్షి):**
టాస్క్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ఎస్ఆర్ కృష్ణ సృష్టించిన త్రీడీ ఆర్ట్‌ను చూసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణలు అమితంగా మెచ్చుకున్నారు. మంథని నుంచి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు ఉన్న వ్యక్తులు ఉన్నారని గర్వంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ కృష్ణ మాట్లాడుతూ, టాస్క్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో త్రీడీ ఆర్ట్‌ను కూడా నేర్పించి, ఆసక్తి ఉన్నవారిని త్రీడీ ఆర్ట్ టీచర్లుగా తీర్చిదిద్ది ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా మంథని నుంచి త్రీడీ ఆర్ట్ నేర్పించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వ్యక్తం చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణలో అధునిక నైపుణ్యాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలనే సంకల్పంతో మంథనిలో టాస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో త్రీడీ ఆర్ట్‌ను తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కృష్ణ తన కర్ణాటకలో రాహుల్ గాంధీకి వేసిన త్రీడీ ఆర్ట్ గురించి ఎంపీ వంశీకృష్ణ, మాజీ డీజీపీ రాజీవ్ త్రివేది తదితరులకు వివరించారు. టాస్క్ ఇన్‌చార్జి పనకంటి రాకేష్, సీఈఓ నితిన్ రెడ్డి, కంట్రోల్ ఎస్ కంపెనీ సీఈఓ రాఘవేంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మాజీ డీజీపీ రాజీవ్ త్రివేది, ఆర్‌డీఓ, ఎంఆర్ఓ, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, అంతర్జాతీయ అవార్డు గ్రహీత ఖాజా మొయినుద్దీన్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో సాంకేతిక సమస్య

### ఫోటో హాజరుకోసం గంటల తరబడి నిరీక్షణ



**కోహిర్ మే 6 (జనం సాక్షి):**
కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని, వికసిత్ భారత్ ఉపాధి జీవనోపాధి మిషన్ గ్రామీణగా' మార్పు చేసిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో పనిదినాలు పెరగడం పట్ల కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నప్పటికీ, అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పనిస్థలాల్లో ఫోటో ఆధారిత హాజరు విధానం కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు తలనొప్పిగా మారిందని పలువురు తెలిపారు. ఆదివారం మినహా ప్రతిరోజూ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు కూలీలు పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు. అయితే పని పూర్తయిన అనంతరం హాజరు నమోదు కోసం ఫోటోలు తీయాల్సి రావడంతో ఒక్కోసారి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని కూలీలు చెబుతున్నారు. పని చేసిన సమయం కన్నా ఫోటో కోసం ఎదురుచూసే సమయమే ఎక్కువగా మాచిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మహిళా కూలీలు, వృద్ధులు భోజన సమయానికి ఇళ్లకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇంకా కొన్ని గ్రామాల్లో మొబైల్ సిగ్నల్ సరిగా లేకపోవడంతో హాజరు నమోదు మరింత అలస్యమవుతోందని తెలుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపయోగిస్తున్న పాత మోడల్ మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయక, యాప్లు అప్డేట్ కాకపోవడం, ఫోటోలు అప్లోడ్ కాకపోవడం వంటి సమస్యలు తరచూ,ఎదురవుతున్నాయని సమాచారం. దీంతో ఒక ఫోటో నమోదు చేయడానికే ఎక్కువ సమయం, పట్టి.కూలీలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లకు కొత్త అప్డేటెడ్ మొబైల్ ఫోన్లు అందించాలని, సిగ్నల్ కాని ప్రాంతాల్లో ఆఫ్లైన్ హాజరు నమోదు లేదా ప్రత్యామ్నాయ విధానం అమలు వేయాలని కూలీలు కోరుతున్నారు. గ్రామీణ పరిస్థితులకు అనుగుణంగా లొకేషన్ ఆధారిత ఫోటో విధానంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని వెడుకుంటున్నారు.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు ఏటా వే సవి భత్యం అందిస్తున్నాయి. ప్రస్తుతం చేసిన పనులకు కూడా సక్రమంగా వేతనాలు ఇస్తున్నారని,ఉపాధి హామీ పథకంలో ఏటా వేసవి భత్యం పనికి,సౌకర్యాల కల్పనకు కృషి,ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటు న్నారు. ప్రభుత్వం గ్రామపంచా యతీలకు పని ప్రదేశా ల్లో నీడకోసం టెంట్లు, తాగునీటి వసతులు కల్పిస్తున్నారని. పిలాస్ట్. కే. జైపాల్ తెలిపారు.

# అధికారుల నిర్లక్ష్యంతోనే వడ్లు తడిసిపోయినయ్

- కాంటాలు పెట్టకపోతే రోడ్డు దిగ్బంధం చేస్తం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి అకాల వర్షంతో తడిసన ధాన్యంను పరిశీలించారు. కేంద్రం ప్రారంభించినా ఇప్పటి వరకు గింజ కొనుగోలు చేయకపోవడంపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథని ఎమ్మెల్యే పోలీస్ పహారాలో మంథనిలోని మార్కెట్ యార్డును సందర్శించి ఎలాంటి ఇబ్బందులు లేవని, సక్రమంగా కొనుగోళ్లు జరుగుతున్నాయని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం రాత్రి విపత్తు తప్ప మరోప్రమాదం ఏమీ లేదన్నారని ఆయన విమర్శించారు. మంథని ఎమ్మెల్యే బుల్లెట్ ప్రూఫ్ కార్లలో తిరుగుతుంటే ఏమీ కనబడటం లేదని, ఆయన తర్వాత ఆయన తమ్ముడిని బుల్లెట్ ప్రూఫ్ కార్లలో పోలీస్‌పహారాలో తిప్పుతాడని ఆయన ఎద్దేవా చేశారు. అడవిసోమన్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ పంటను తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా కాంటాలు పెట్టలేదని, రైతులు రోడ్డెక్కి ధర్న చేస్తే హుటాహుటీని కాంటాలు, గన్నీసంచులు తీసుకువచ్చారే కానీ కొనుగోళ్లు మాత్రం ప్రారంభించలేదన్నారు. ఇప్పటి వరకు ధాన్యం సేకరణ మొదలు పెట్టకపోవడంతో అకాల వర్షానికి కేంద్రంలో యాభై శాతం వడ్లు తడిసిపోయాయని, మరోసారి వర్షం కురిస్తే మొత్తం తడిసిపోతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అడవిసోమన్‌పల్లిలో రైతుల ఇబ్బందులకు కాంగ్రెస్ నాయకులే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అడవిసోమన్‌పల్లి కేంద్రంలో కొనుగోళ్లు మొదలుపెట్టాలని, కేంద్రంలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు, లేని పక్షంలో మంథని కాటారం రోడ్డును దిగ్భందిస్తామని, రైతులను న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# భవిష్యత్తులో తెలంగాణలోనూ బీజేపీ అధికారం

- ప్రధాని మోదీ బహిరంగ సభకు వనపర్తి నుంచి భారీ సమీకరణ
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య పిలుపు

**వనపర్తి, మే 6 (జనంసాక్షి):** భవిష్యత్తులో తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ అధ్యక్షతన జిల్లా నూతన కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో మల్కా కొమరయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి 8 వేల కోట్ల రూపాయలు వెచ్చించి అనేక ప్రాజెక్టులను అంకితం చేయడానికి ప్రధాని మోదీ తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. ఈ సభకు వనపర్తి జిల్లా నుంచి ప్రతి బూత్ నుంచి, మండలాల నుంచి భారీ ఎత్తున జనాన్ని తరలించాలని పిలుపునిచ్చారు.
కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సంక్షేమ పథకాల పేర్లు మార్చి ఓట్ల రాజకీయాలు, మైనారిటీ సంతృప్తి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు బీజేపీ విజయాలను సూచిస్తున్నాయని, అదే ఉత్సాహంతో తెలంగాణలో కూడా 'డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి కరణం పరిణీత, జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్రెడ్డి, రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, ఆర్. లోకనాథ్ రెడ్డి, ఆర్. పురుషోత్తం రెడ్డి, ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అన్నదాతలు విద్యుత్ ప్రదాతలు కావాలి

**నందిపేట్ మే 6 జనం సాక్షి:**



నందిపేట్, డొంకేశ్వర్, మాక్లూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు 7 తేదీ గురువారం రోజున జరిగే అన్నదాత విద్యుత్ ప్రదాత అనే కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని, ఆయా మండలాల రైతు వేదికల లో జరిగే ఈ కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా జరుగుతుందని, విద్యుత్ సమస్యలతో పాటు ముఖ్యంగా అన్నదాతలు విద్యుత్ ప్రదాతలు కావాలనే ఉద్దేశంతో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి గురించి, దానికి ప్రభుత్వ ప్రోత్సాహాలు, సూచనలు, సలహాలు ఇచ్చి రైతును సోలార్ ఉత్పత్తి దారునిగా తీర్చిదిద్దేందు కు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, ప్రతి ఒక్కరైతు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నందిపేట్ విద్యుత్ శాఖ ఏడిఈఎం అశోక్ తెలిపారు.

# 18 వేల వైద్య ఉద్యోగాల భర్తీ చేపట్టాం





- త్వరలో ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలు
- విద్య, వైద్య, మహిళా సాధికారతకు ప్రాధాన్యం : మంత్రి దామోదర్ రాజనర్సింహ
- బాలసదనం నూతన భవనం ప్రారంభం

**నారాయణఖేడ్, (జనంసాక్షి):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణఖేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖల్లో సుమా రు 18 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టినట్లు వెల్లడించారు. త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం మరియు నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్య, వైద్య, మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బాలసదనాలు, అంగన్వాడీల అభివృద్ధికి ప్రభుత్వం, సీఎస్ఆర్ నిధులతో కృషి చేస్తున్నట్లు వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కు పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రీ-స్కూల్ విద్య ఉచితంగా అందిస్తున్నా మన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవ్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. బాలసదనంలో తక్షణం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికలాం గులకు స్కూటర్లను పంపిణీ చేశారు. బాలసదనం బాలికలతో మంత్రి ముఖా ముఖి సంభాషించి వారి సమస్యలు తెలుసుకున్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, స్థానిక ఎమ్మెల్యే డా. సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో నారాయణఖేడ్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

# అంజయ్య నగర్‌లో వ్యక్తి కిడ్నాప్ కలకలం

## ఇంటి స్థలం కబ్జా కోసమేనా!?

**శేరిలింగంపల్లి, మే 06 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో బుధవారం ఓ వ్యక్తి కిడ్నాప్ సంఘటన స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించింది. అంజయ్య నగర్‌లో ఇంటి నెం. 223/135లో 35 సంవత్సరాలుగా తల్లితో కలిసి నివసిస్తున్న లిలిగెల్వయ్య (35)లిలిను ఓ ప్రైవేట్ ముఠా బలవంతంగా కారులో ఎక్కించుకుని అపహరించి తీసుకెళ్లిందని స్థానికులు, బాధితుడి తల్లి వెల్లడించారు.
గత కొంతకాలంగా అంజయ్య నగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో బయటి వ్యక్తులు స్థానికులను బెదిరించి ఇళ్లు, స్థలాలు ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గెల్వయ్యపై ఇంతకు ముందు కూడా ఒకటి రెండు సార్లు బెదిరింపులు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.
బుధవారం గెల్వయ్య ఇంటి మీదికి వచ్చిన ముఠా అతడి వివరాలు తీసుకుని దాడి చేసి, బలవంతంగా కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదట పోలీసులు ఫిర్యాదు తీసుకోవడానికి ఆసక్తి చూపకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తర్వాత స్థానికుల ఒత్తిడి మేరకు ఫిర్యాదు నమోదు చేసుకున్నట్లు తెలిసింది. ఈ దాడి వెనుక రియల్ ఎస్టేట్ మాఫియా, ప్రైవేట్ గుండాలు ఉన్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. రాయదుర్గం పోలీసులకు ముందే సమాచారం ఉందా? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అంజయ్య నగర్ నివాసులపై దాడుల వెనుక తెరవెనుక పోలీసుల పాత్ర ఉందా అని కూడా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేసి గెల్వయ్యను సురక్షితంగా బయటపడేసి, నిజమైన నిందితులపై చర్యలు తీసుకుంటారా అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# దమ్మారో దమ్ము.. పొగాకు
# రైతు నోట్లో దుమ్ము!

## ఇది పొగాకు రైతుల దీనస్థితి..

- పొగాకు కంపెనీలు దమ్ము మీద దమ్ము కొడుతున్నాయి..
- రైతుల పోగాకు అమ్ముడుపోక ఎదలు బాదుకుంటున్నారు..



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి మే 06(జనం సాక్షి) :**
గద్వాల మరియు నంద్యాల వంటి జిల్లాల్లో, ఐటీసీ, జీపీఐ, వీఎస్టీ మరియు అలయన్స్ వంటి ప్రైవేట్ కంపెనీలు రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని పొగాకు సాగు చేయించాయి. అయితే, క్వింటాకు రూ. 15,500 నుండి రూ. 18,500 వరకు చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నప్పటికీ, కంపెనీలు సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం మరియు నాణ్యత పేరిట ధరలు తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.
ఒప్పందాల ఉల్లంఘన తో కంపెనీలు ముందస్తు ఒప్పందాలకు భిన్నంగా వ్యవహరిస్తూ, క్వింటాకు కేవలం రూ. 9,000 వరకు మాత్రమే ఆఫర్ చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్ల నిలిపివేత తో నాణ్యత లేదనే కారణంతో చాలా వరకు పంటను కంపెనీలు తిరస్కరిస్తున్నాయి, దీనితో వేల క్వింటాళ్ల పొగాకు కల్లాల్లోనే నిలిచిపోయింది. ఆర్థిక కష్టాలు వల్ల అప్పులు చేసి పంట పండించిన రైతులు, కంపెనీల తీరు వల్ల పెట్టుబడులు కూడా తిరిగి రాక ఆత్మహత్యాయత్నాలు లేదా తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వ పాత్ర పొగాకు బోర్డు ఎలక్ట్రానిక్ వేలం వ్యవస్థ ద్వారా ధరలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రైవేట్ కంపెనీల దోపిడీ కొనసాగుతోంది, ఇది రైతులకు జీవన్మరణ సమస్య గా తలెత్తింది.
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పొగాకు రైతులు మద్దతు ధర కోసం పోరాడుతున్నారు. కిలో పొగాకుకు కనీసం రూ.360 మద్దతు ధర కల్పించాలని రైతులు మరియు రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కంపెనీలు అరకొరగా పంటను కొనుగోలు చేసి కేంద్రాలను మూసివేస్తున్నాయని, దీనివల్ల వేల క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉండిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి బాగా వచ్చినప్పటికీ, ఆశించిన ధర రాకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని, ఫలితంగా రైతులు అప్పులపాలవుతున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. ఏప్రిల్ 2026 నాటికి, ఆంధ్రప్రదేశ్‌లో వర్జీనియా పొగాకుకు గతేడాది కంటే తక్కువ ధర లభిస్తోంది. ప్రారంభ ధరగా కిలోకు రూ.265-290 వరకు పలుకుతుండగా, సగటున రూ.255-260 వరకు కొనుగోలు చేస్తున్నారు, ఇది రైతులను నిరాశకు గురిచేస్తోంది. గతేడాది రికార్డు ధర రూ.411-418 వరకు లభించగా, ఈ ఏడాది మార్కెట్ ఆరంభంలోనే ధర తగ్గింది. అధిక పన్నులు, అంతర్జాతీయ పరిణామా లు ధరల తగ్గుదలకు కారణాలుగా పేర్కొంటున్నారు. రైతులు కనీసం కిలోకు రూ. 320 ఆశిస్తున్నారు.

# కాంగ్రెస్ పాలన... అభివృద్ధికి బాసట

### శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నేత చాంద్ పాషా



**శేరిలింగంపల్లి, మే 06(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలు పేదల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అద్భుత ప్రగతితో ముందుకు సాగుతుందంటే అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనగానే భావించాల్సి ఉంటుందని శరీర లింగంపల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్ చాంద్ పాషా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం శేరిలింగంపల్లిలో మాట్లాడుతూ నిరుపేదల పక్షాన నిలబడి, గత వందేళ్లకు పైగా వారి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చాంద్ పాషా వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని, ప్రజలకు సేవ చేయాల్సిన నాయకులే స్వలాభం చూసుకుంటూ ఎంతసేపు కుటుంబ పాలన కోసం, వ్యక్తిగత ఆస్తుల సమీకరణ కోసం పాటుపడుతుండడం దౌర్భాగ్యం అని, రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని పాలించిన గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చే పీల్చి పిప్పి చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2014 నుండి 2024 వరకు రాక్షస పాలన సాగిందని... ఆ పదేళ్ల పాలనను రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలలో కాంగ్రెస్ కు అధికారం కట్టబెట్టడం ద్వారా అంతం చేయడంతో తిరిగి సామాన్యుని పాలన మొదలైందని, మునుముందు రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో సైతం ఇదే వరవడిని ప్రజలు అనుసరించి కాంగ్రెస్ పార్టీకి పూర్తి బాధ్యతలను అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అవాకులు చవాకులు పేలుతున్న గులాబీ దండు, అవినీతి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్రం నుండి తరిమికొట్టాలని షేక్ చాంద్ పాషా పిలుపునిచ్చారు. ఇందిరమ్మ రాజ్యం... ఇంటి కుటుంబంపార్టీ లాంటి కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎల్లవేళలా ఆదరించాలని భారీ ఓట్లతో ఆశీర్వదించాలని కానున్న ప్రతి ఎన్నికలలో తప్పకుండా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఓటు వేసి గెలిపించాలని కోరారు. భారత దేశంలో అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ దేశంకోసం అధినేతల ప్రాణాలను అర్పించిందని, కులాలకు మతాలకు అతీతంగా కాంగ్రెస్ కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలో ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ పథకాలు అందాయని... గత కాంగ్రెస్ సారథులు పి.జనార్దన్ రెడ్డి, వైయస్ రాజశేఖర్ రెడ్డిలు నిరుపేదలకు సొంతింటికల నెరవేర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ నిజాం, ఇలియాజ్, యూసఫ్, రవి వర్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
7 మే 2026

# యువత నైపుణ్యాభివృద్ధితో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం





- డేటా సైన్స్, ఏఐ, మల్టీమీడియా రంగాల్లో శిక్షణ
- మహిళల సాధికారతకు కుట్టు కేంద్రాలు, గార్మెంట్స్ యూనిట్
- మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**మంథని, మే 6 (జనంసాక్షి) :** యువతలో నైపుణ్యాభివృద్ధి ద్వారానే తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం సాధ్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలతో కలిసి మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా టాస్క్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మల్టీమీడియా, ఆడియో విజువల్ రంగాల్లో శిక్షణ అందించనున్నారు. కర్టల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ సీఎస్ఆర్ కింద సహకరిస్తోందని, హైదరాబాద్‌కు 220 కి.మీ. దూరంలో ఉన్న మంథని వంటి ప్రాంతాల యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కల్పించనున్నట్లు వివరించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు ఈ కేంద్రం కూడా యువతను ఉద్యోగ సిద్ధులను చేస్తుందన్నారు. టాస్క్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇప్పటికే మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి ఉద్యోగాలు సాధించారని ఉదాహరణలు ఇచ్చారు. మహిళల సాధికారత: మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించామని, గంగాపురిలో రూ.7.30 కోట్లతో ప్లగ్ అండ్ ప్లే గార్మెంట్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఇది పూర్తయితే 400 మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, యువత కష్టపడే మనస్తత్వంతో ఎదుర్కొన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని సూచించారు.

**తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు**

అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంథని మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన మంత్రి, తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**99 రోజుల ప్రజా పాలన కార్యక్రమం**

ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు 5 నెలలు పూర్తయిన సందర్భంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ కాలంలో అన్ని శాఖలు ప్రజల వద్దకు వెళ్లి పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాయన్నారు.

మంథని నియోజకవర్గంలో 26 వేల కుటుంబాలు గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ప్రతి పేద కుటుంబానికి 6 కేజీల సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంచడం, రైతు భరోసా, ఉచిత బస్సు సౌకర్యం వంటి సంక్షేమ పథకాలను వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సిలిండర్ వంటి పథకాల్లో మిగిలిన అర్హులందరికీ జూన్ 2 లోపు లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, టాస్క్ చైర్మన్ నితిన్ కుమార్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ డైరెక్టర్ రాజీవ్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన బోధన్ పట్టణ ఎస్సై భాస్కరా చారి

**బోధన్, మే 6 (జనంసాక్షి) :** ప్రజలకు జవాబుదారితరంగా ఉండాలని, విధులను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించాలని, సివిల్ వివాదాలకు దూరంగా ఉండాలని జిల్లా సిపి సాయి చైతన్య పదేపదే చెపుతున్నప్పటికీ బోధన్ పోలీసులు పెడచెవిన పెట్టారనేందుకు నిదర్శనం బుధవారం బోధన్ పట్టణ ఎస్సై భాస్కరా చారి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా దొరికిన సంఘటనగా చెప్పవచ్చు. అయితే త్వరలో బోధన్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహించే మరో ఎస్సై ఏసీబీ దాడుల బరిలో ఉన్నట్లు సమాచారం. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నెలలో ఓ కేసుకు సంబంధించి ముగ్గురికి నోటీసులు అందించి అరెస్టు చేయడం జరిగిందన్నారు. అయితే అదే కేసులో మరికొంద రి ప్రమేయం ఉన్నట్లు సదరు బాధితుడికి ఫోన్ చేయడం జరిగిందన్నారు. అయితే అతని పేరును తప్పించేందుకు పట్టణ ఎస్సై భాస్కరాచారి 10,000 రూపాయలను డిమాండ్ చేయడం జరిగిందని అయితే బాధితుడు 7000 రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని తమ వద్దకు రావడం జరిగింది అన్నారు. దాంతో నేడు బాధితుడు ఎస్సై భాస్కరా చారికి లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందని ఏసీబీ డీఎస్పీ వివరించారు. ఈ మేరకు ఎస్సై భాస్కరా చారిని ఏసీబీ కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని, ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే 1064 నెంబర్ కు డయల్ చేయాలని వెంటనే ఏసీబీ అధికారులు బాధితులకు అండగా ఉంటారని ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ స్పష్టం చేశారు. బోధన్ పోలీస్ స్టేషన్ లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడంతో బోధన్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.

# సామాన్య మహిళగా సీపీ సుమతి 'మిడ్ నైట్' ఆపరేషన్

- అర్ధరాత్రి బస్టాండ్‌లో ఒంటరిగా నిరీక్షణ
- 40 మంది పోకిరీల అరెస్ట్
- గాఢ నిద్రలో పెట్రోలింగ్ వాహనాలు







**మల్కాజిగిరి మే 6 (జనంసాక్షి):** మహిళల రక్షణ కవచం అని చెప్పుకునే పోలీస్ వ్యవస్థ క్షేత్రస్థాయిలో ఎలా పనిచేస్తోందో తెలుసుకునేందుకు మల్కాజిగిరి నూతన పోలీస్ కమిషనర్ సుమతి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ఎటువంటి భద్రతా సిబ్బంది లేకుండా, సామాన్య మహిళా వేష ధారణలో అర్ధరాత్రి వేళ దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో రంగంలోకి దిగారు.రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు సీపీ ఒంటరిగా బస్సు కోసం వేచి చూశారు. ఆ సమయంలో సుమారు 40 మంది పోకిరీలు, మద్యం మరియు గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆమెను చుట్టుముట్టి అసభ్యకర వ్యాఖ్యలతో వేధించారు. అయినా ఆమె భయపడకుండా ధైర్యంగా అక్కడే నిలబడి పోకిరిల చేష్టలను గమనించారు.అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ మూడు గంటల వ్యవధిలో కనీసం ఒక్క పెట్రోలింగ్ వాహనం కూడా ఆ పరిసరాల్లో కనిపించకపోవడం గమనార్హం. చివరకు తెల్లవారుజామున 3:30 గంటలకు బీట్ కానిస్టేబుల్ అక్కడికి చేరుకున్నారు. వరుసగా మూడు రోజుల పాటు రహస్యంగా ఆమె బస్టాండ్ పరిసర ప్రాంతాలలో నిఘా పెట్టారు, వేధింపులకు పాల్పడిన 40 మందిని గుర్తించి అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు కావడం ఆందోళన కలిగిస్తోంది. వీరందరికీ పోలీసు కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. చదువుకోవడానికి నగరానికి వచ్చి హాస్టల్లో ఉంటూ వ్యసనాలకు బానిసలై నేరాల బాట పట్టడం దురదృష్టకరం. నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేదని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించా రు. అధికారిక హోదాను పక్కన పెట్టి, క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకు నేందుకు ప్రాణాలకు తెగించి ఆపరేషన్ నిర్వహించిన మల్కాజిగిరి కమిషనర్ సుమతిపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. "రియల్ లేడీ సింగం" అంటూ ఆమె నిబద్ధతను కొనియాడుతున్నారు. ఈ ఘటనతోనైనా పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

# రెనే హాస్పిటల్స్‌లో విజయవంతంగా రోబోటిక్ సర్జరీ

- 18 మందికి ఉచిత మోకాలు కీలు మార్పిడి
- శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం
- 40 లక్షల వైద్యం ఉచితంగా అందించిన డా. బంగారి స్వామి
- మానకొండూర్ ఎమ్మెల్యే డా. సత్యనారాయణ ప్రశంస



**కరీంనగర్ బ్యూరో, మే 06 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని రెనే గ్రూప్ అఫ్ హాస్పిటల్స్ చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డా. బంగారి రజని ప్రియదర్శిని ఆధ్వర్యంలో రెనే హాస్పిటల్ – శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మోకాలు కీలు మార్పిడి శస్త్రచికిత్స లు విజయవంతంగా ముగిశాయి. ఎంపికైన 18 మంది లబ్ధిదారులందరికీ ఆపరేషన్లు పూర్తి చేసి బుధవారం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు.ప్రతి ఏటా తన తల్లిదండ్రుల పేరు మీద నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరంలో ఈసారి అత్యాధునిక జాన్సన్ అండ్ జాన్సన్ వేల్లీస్ రోబోటిక్ కీలు మార్పిడి విధానాన్ని అమలు చేశారు. 18 మందిలో 8 మందికి రోబోటిక్ సర్జరీ, మిగిలిన వారికి సాధారణ పద్ధతిలో మోకాలి కీళ్ల మార్పిడి చేయడం జరిగింది. 2026 మార్చిలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపుకు వచ్చిన సుమారు 600 మంది పేషెంట్ల నుంచి లక్కీ డ్రా ద్వారా 18 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 40 లక్షల రూపాయల వైద్యం పూర్తిగా ఉచితంగా అందించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, డా. బంగారి స్వామి సమాజానికి చేస్తున్న ఉచిత వైద్య సేవలను కొనియాడారు. అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతను కరీంనగర్‌కు తీసుకురావడం మాత్రమే కాకుండా, పేదలకు ఉచితంగా అందించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

డా. బంగారి స్వామి మాట్లాడుతూ, తన తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనప్పటికీ తమందరికీ ఉన్నత విద్య అందించారని, చిన్నతనంలో తండ్రిని కోల్పోయినా తల్లి ఎన్నో కష్టాలు ఎదుర్కొని తమ భవిష్యత్తును సురక్షితం చేసిందని గుర్తు చేశారు. భౌతికంగా లేని తల్లిని సేవా కార్యక్రమాల ద్వారా చిరంజీవిగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన సతీమణి డా. రజని ప్రియదర్శిని, విదేశాల్లో ఉన్న సోదరులు, వైద్య బృందం, ఆపరేషన్ థియేటర్ మరియు నర్సింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ ఉచిత మోకాలి కీళ్ల మార్పిడి కార్యక్రమాన్ని తన కుమారులు డా. సాత్విక్, డా. రిత్విక్ ద్వారా కొనసాగించనున్నట్లు ప్రకటించారు. అలాగే రజని ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా ప్రతి ఏటా 10 మంది పేద దంపతులకు ఉచిత ఐవిఎఫ్ విధానం, 2026 డిసెంబర్ నుంచి సెరిబ్రల్ పాల్సీ బాధిత పేద పిల్లలకు ఉచిత వైద్యం అందించే యోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రజని ప్రియదర్శిని, డా. మునీష్, డా. కృష్ణారెడ్డి, డా. సుధీర్ ద్వారక్‌నాయుడు, డా. సురేష్ కుమార్, డా. నిఖిల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# యమపాశాలుగా విద్యుత్ తీగలు

## గన్నేరువరం మండలంలో ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లు

- అధికారుల నిర్లక్ష్యం... భయాందోళనలో రైతులు, కూలీలు
- ఖాసీంపేట్‌లో వైర్లు తగిలి మంటలు - తప్పిన ప్రమాదం
- తక్షణం సరిచేయాలని ప్రజల డిమాండ్



**గన్నేరువరం, మే 6 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గన్నేరువరం, ఖాసీంపేట, యాస్వాడ, మైలారం, జంగపల్లి, చొక్కారావురావుపల్లె తదితర గ్రామాల్లో ఎక్కడికక్కడే తీగలు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. వీటిని సరిచేయడానికి అధికారులు ఎలాంటి చొరవ చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం గ్రామాల్లో వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాల్లోకి వెళ్లాలంటేనే భయం. హార్వెస్టర్ రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాదకరంగా ఉన్న చోట్ల రైతులే తాత్కాలికంగా కర్రలతో స్తంభాలు ఏర్పాటు చేసుకుని పనులు చేస్తున్నారు. అనేక చోట్ల చెట్లు, పొదలు తీగలను తాకుతున్నా వాటిని తొలగించే చర్యలు లేవు. దీంతో గాలికి కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరా తరచూ అంతరాయం కలుగుతోంది.

ఖాసీంపేట్ గ్రామంలో ఈ నెల 4వ తేదీ సోమవారం బొజ్జ శ్రీకాంత్, మంద ఐలయ్యల పొలంలో హార్వెస్టర్‌తో వరి కోత పనులు జరుగుతుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. వరి గడ్డి అంటుకొని మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన రైతులు పచ్చి కొమ్మలతో మంటలను అరికట్టారు. ఈ ఘటనపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. తక్షణం వైర్లను సరిచేసి, అవసరమైన చోట్ల స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.





# ధాన్యం కొనుగోలులో వేగం పుంజుకోవాలి

- రైస్ మిల్లులను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- తూకాల్లో తేడాలు, రైతులకు ఇబ్బందులు సహించేమని హెచ్చరిక



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ రుద్రంగి మే 6 (జనంసాక్షి):** రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. బుధవారం వేములవాడలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియ సక్రమంగా జరుగుతుందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, మిల్లర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో తేడాలు వచ్చినా, రైతులను ఎలాంటి ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని మిల్లర్లను హెచ్చరించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం వారి ప్రయోజనాలను రక్షిస్తుందని భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, దీనికోసం అదనపు లారీలు, వ్యాన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే ట్రాక్టర్లను కూడా వినియోగించడానికి వెసులుబాటు ఉంటుందన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకానికి అనుగుణంగా లారీలు సమకూర్చాలని, హమాలీల సంఖ్య పెంచి లోడ్ అయిన వాహనాలను వెంటనే అన్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఖాతాల్లో డబ్బు వేగంగా జమ చేయాలని, ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. అవసరమైతే జిల్లా కేంద్రంలోని ఆపరల్ పార్క్ గోదాములో కూడా ధాన్యం నిల్వ చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రుల బృందం ఇప్పటికే అధికారులకు స్పష్టమైన సూచనలు చేసినట్లు గుర్తు చేశారు. ఈ తనిఖీల్లో మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చేలుకల తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పంట అన్ని గ్రామాల్లో సాగు చేయాలి

**అయిల్ ఫామ్ సాగు రైతులకు అధిక ఆదాయం : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 6 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని ఏండ్రియల్ గ్రామ శివారులో రైతు బొక్క హన్మాండ్లు మూడున్నర ఎకరాలలో సాగు చేస్తున్న అయిల్ ఫామ్ తోటను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. తోటలో మొక్కల పెరుగుదల, నిర్వహణ విధానాలు, సాగు పద్ధతులను పరిశీలించిన కలెక్టర్ పంట అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు బొక్క హన్మాండ్లు మాట్లాడుతూ, 2022 సంవత్సరంలో మూడున్నర ఎకరాలలో అయిల్ ఫామ్ పంటను ప్రారంభించినట్లు తెలిపారు. మూడున్నర ఎకరాలలో అయిల్ ఫామ్‌తో పాటు అంతర్ పంటలుగా కూరగాయలు, సోయా, ఆకుకూరలు, పండ్ల తోటలను సాగు చేస్తూ ఏడాదికి సుమారు రూ.1.20 లక్షల ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు.

అయిల్ ఫామ్ సాగుకు ఉద్యానవన శాఖ ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా ఎకరానికి రూ.4,200 చొప్పున సబ్సిడీ అందించడంతో పాటు డ్రిప్ పరికరాలు కూడా మంజూరు చేసినట్లు రైతు వివరించారు. ప్రభుత్వ సహకారంతో సాగు ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అయిల్ ఫామ్ పంట ధర టన్నుకు సుమారు రూ.23,000 ఉండగా, ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి ఉంటుందని రైతు ఆనందం వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా లాభదాయకమైన పంటగా అయిల్ ఫామ్ రైతులకు మంచి ఆదాయ వనరుగా మారుతోందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలు, అంతర్ పంటల సాగు ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సలహాలను వినియోగించుకొని మరిన్ని రైతులు అయిల్ ఫామ్ సాగుపై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌హెచ్‌ఓ జ్యోతి, సీపీఓ, డిఎల్‌పిఓ , ఎమ్మార్వో, ఎంపీవో, ఎంపీడీవో సవిత రెడ్డి సర్పంచ్ సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఆదాని ఆస్తుల కాపాలదారుడు నరేంద్ర మోడీ

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్టు, మే 6(జనం సాక్షి ):** అంబానీ, ఆదానీ, కార్పొరేట్ల ఆస్తులని కాపాడటమే నరేంద్ర మోడీ కర్తవ్యమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలని మరియు పెట్రోల్,డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం నాడు రావి నారాయణ రెడ్డి చౌరస్తాలో మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమానికి ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురికి మధ్య తోపులాట చోటుచేసుకుంది పెట్టకేలకు సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మని దగ్ధం చేశారు ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ దేశంలో సామాన్య నిరుపేద ప్రజలు అధిక ధరలతో గ్యాస్ సంక్షోభంతో సతమతమవుతున్న సందర్భంలో గుజరాత్ వ్యాపారస్తుల ఆస్తులను పెంచడం కోసం నిత్యవసర వస్తువుల పైన పెట్రోల్ డీజిల్ పైన గ్యాస్ పైన ధరలు పెంచి సామాన్యుల పైన అధిక భారం వేసారని మండిపడ్డారు.యుద్ధం సాకుతో దేశ ప్రజలకి తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశ ప్రజలంతా అనుకున్నట్లుగానే ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ధరలను పెంచారని ఇది కార్పొరేట్లకు ఆస్తులను పెంచడం కోసమే అని మండిపడ్డారు.ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలియజేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం విడ్డూరమని ప్రజలని ప్రజా ఉద్యమాలని ఎంత అణిచివేయాలని చూసిన రెట్టింపు ఉత్సాహంతో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.వెంటనే పెంచిన గ్యాస్ ధరలను పెట్రోల్ డీజిల్ ధరలని నిత్యవసర వస్తువుల ధరలని తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్మెట్ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ,బిఓసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్,మండల కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి,కాటీ అరుణ,వట్టి నవనీత,పేరాల గోపి,సైదులు ముదిరాజ్,డవుల రాములు,మంగలిపల్లి రవి,నరసింగం సుధాకర్, అశోక్, అనిల్, క్రాంతి ప్రియ, అన్నపూర్ణ, సుమలత, వీణ, రవళి, పాండు, నాగమణి, నిలా, కావేరి శోభన్, సిపిఐ విద్యార్థి, మహిళ, యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# లేబర్ కార్డు రెన్యువల్ తప్పనిసరి

**ఉప కార్మిక కమిషనర్ కోల ప్రసాద్**

హుజురాబాద్, మే 6 (జనం సాక్షి): కార్మికులు తమ లేబర్ కార్డులను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉప కార్మిక కమిషనర్ కోల ప్రసాద్ సూచించారు. హుజురాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం మేడే ఉత్సవాల్లో భాగంగా కార్మికులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు పొందాలంటే లేబర్ కార్డు చెల్లుబాటు ఉండటం అత్యంత అవసరమని అన్నారు. లేబర్ కార్డు గడువు ముగిసిన కార్మికులు వెంటనే సంబంధిత కార్యాలయాలను సంప్రదించి పునరుద్ధరణ (రెన్యువల్) ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. రెన్యువల్ చేయించుకోని పక్షంలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఇంచార్జ్ కార్మిక శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, మధు, నాయకులు కోయల్కర్ బాలాజీ, సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్, కార్మిక నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ సివి ఆనంద్ బుధవారం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోశిని కూడా ఆయన కలిశారు. కేవలం మర్యాదపూర్వక భేటీలో భాగంగానే ఈ సమావేశాలు జరిగాయి.

# సీఎం పదవికి హిమంతబిశ్వ శర్మ రాజీనామా

## గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రం సమర్పణ



**గౌహతి, మే6 (జనంసాక్షి) :** అస్సాం ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు అందజేశారు. బుధవారం లోక్ భవన్‌కు వెళ్లిన హిమంత బిశ్వశర్మ.. తన కేబినెట్ సహచరులతో కలిసి రాజీనామా చేశారు. దీంతో బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సీఎం కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. రాజీనామాను ఆమోదించి, కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకూ శర్మను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరినట్లు వెల్లడించింది. రాజీనామా అనంతరం లోక్ భవన్ వెలుపల మీడియాతో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. మే 11 తర్వాత ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది చరిత్రాత్మక విజయం కావడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో జరిగే బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో కొత్త సీఎంని ఎంపిక చేస్తారని శర్మ తెలిపారు. కాగా, 126 మంది సభ్యులున్న అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరగగా.. మే 4న ఫలితాలు విడుదల అయ్యాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది.

# రైతుల కన్నీళ్లలో రేవంత్ కొట్టుకుపోవడం ఖాయం

## వరంగల్ రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్



**వరంగల్, మే6 (జనంసాక్షి) :** కేసీఆర్ పాలన రైతాంగానికి స్వర్ణయుగమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రైతుబిడ్డగా వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా కేసీఆర్ పాలన కొనసాగిందని అన్నారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు రాబందు పాలన అని విమర్శించారు. రైతు కన్నీళ్లలో రేవంత్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. హనుమకొండలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం ఆగమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో వెయ్యి మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ వరంగల్ అని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు. కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెడితే అదే సమయానికి రేవంత్ రెడ్డి మీటింగ్ పెట్టారని తెలిపారు. కానీ రేవంత్ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి అలయ్ బలయ్ చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కేసీఆర్ రూ.72వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో చివరి భూముల వరకు కేసీఆర్ నీళ్లిచ్చారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని అన్నారు.

# సినిమా పేరుతో 25 లక్షల మోసం

- సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు



**ముంబయి, మే6 (జనంసాక్షి) :** ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. పలాశ్ ముచ్చల్ వ్యక్తిగత జీవితం కూడా గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. ఆయన, క్రికెటర్ స్మృతి మంధాన మధ్య నిశ్చితార్థం జరిగి, పెళ్లి కూడా ప్లాన్ అయినప్పటికీ అనూహ్యంగా అది రద్దయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పట్లో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. వాటిపై స్పందించిన పలాశ్, ఆధారాలు లేని వార్తలను నమ్మవద్దని, తన వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు. అయితే తాజాగా నమోదైన అట్రాసిటీ కేసుతో పలాశ్ ముచ్చల్ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

# అర్ధరాత్రి వర్షానికి కల్లాల్లో తడిసిన ధాన్యం

**జయశంకర్ భూపాలపల్లి, మే6 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళ వారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు, మొక్కజొన్నలు నీటిపాలయ్యాయి. ప్రభుత్వం వడ్లు, మక్కలు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు కల్లాల్లో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. జిల్లాలో సుమారుగా 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మల్హర్, మహాదేవపూర్, పలిమెల మండలాల్లో వర్షపాతం నమోదయింది. ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఏఎన్ఎంల భర్తీకి తొలగిన అడ్డంకులు

## మూడేండ్ల ఎదురు చూపులకు ఎండ్ కార్డ్

- కోర్టు చిక్కులు వీడడంతో ఫలితాల విడుదలకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సన్నద్ధం
- మూడు రోజుల్లో ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ (ఏఎన్ఎం) పోస్టుల భర్తీకి అడ్డంకులు తొలగిపోయాయి. కోర్టు కేసులు పరిష్కారం కావడంతో ఫలితాల విడుదలకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమవుతోంది. మరో 3 రోజుల్లో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. ఆరోగ్య శాఖలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేస్తామని తెలంగాణ ఉద్యమ సమయంలో, 2014 మేనిఫెస్టోలో బీఆర్ఎస్ (టీఆర్ఎస్) హామీ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆ హామీని బీఆర్ఎస్ నిలుపుకోలేకపోయింది. ఈ క్రమంలో ఏఎన్ఎంలు రకరకాలుగా నాటి బీఆర్ఎస్ సర్కార్‌కు తమ నిరసన తెలియజేశారు. పలుమార్లు సమ్మెలు చేశారు. 2023లో ఏఎన్ఎంల నిరసనలు తీవ్రం అయ్యాయి. దీంతో 2023 ఎలక్షన్లకు 3 నెలల ముంగట, ఏఎన్ఎం పోస్టుల భర్తీకి బీఆర్ఎస్ సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను బుజ్జగించేందుకు వారికి 30 మార్కుల వెయిటేజీ ఇస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించింది. దీంతో నిరుద్యోగ (నాన్ సర్వీస్) ఏఎన్ఎంలు కోర్టుకు వెళ్లారు. 30 మార్కులు ఇవ్వడం చట్ట విరుద్ధం అని, వెయిటేజీని పూర్తిగా తీసివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రిక్రూట్‌మెంట్‌కు బ్రేకులు పడ్డాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రిక్రూట్‌మెంట్లకు సంబంధించి కోర్టుల్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తూ.. ఆరోగ్య శాఖలో రిక్రూట్‌మెంట్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇప్పటికే 12,649 పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. ఏఎన్ఎం పోస్టులకు సంబంధించి హైకోర్టు సింగిల్ బెంచ్ వద్ద ఉన్న కేసులోనూ ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. రిక్రూట్‌మెంట్ ఆపొద్దని కోరింది. ఈ క్రమంలోనూ కోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు 2024 డిసెంబర్‌లో ఏఎన్ఎం పోస్టులకు సంబంధించిన రాత పరీక్ష నిర్వహించింది. కానీ, కోర్టులో కేసు ఉండడంతో తుది ఫలితాలను వెల్లడించలేకపోయింది.

ఈ కేసులో ఇటీవలే కోర్టు తుది తీర్పును ఇచ్చింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 20 శాతానికి మించి వెయిటేజీ ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గతంలో వివిధ కేసుల్లో సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో న్యాయశాఖను రిక్రూట్‌మెంట్ బోర్డు లీగల్ ఒపీనియన్ కోరింది. గతంలో ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు, ప్రస్తుత కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం 20 శాతానికి మించి వెయిటేజీ ఇస్తే.. మళ్లీ లీగల్ సమస్యలు తలెత్తి, రిక్రూట్‌మెంట్ ప్రమాదంలో పడుతుం దని న్యాయశాఖ సూచించింది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు ప్రకారం 20 శాతం వెయిటేజీ ఇచ్చి, రిక్రూట్‌మెంట్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఈ అంశంపై రివ్యూ చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. వీలైనంత త్వరగా ఫలితాలు విడుదల చేసి, భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో 1931 పోస్టులకు సంబంధించిన పోస్టుల ఫలితాల విడుదలకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమవుతోంది. మరో 3 రోజుల్లో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు. 2023 ఎన్నికల ముంగట నోటిఫికేషన్ విడుదల కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 డిసెంబర్‌లో రాత పరీక్ష జరిగింది. సుమారు 25 వేల మంది ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, 20,600 మంది పరీక్షకు హాజరయ్యారు. సుమారు 3 సంవత్సరాలుగా వీరంతా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కోర్టు తీర్పు, ప్రభుత్వం నిర్ణయంతో వీరి ఉద్యోగ ఆకాంక్షలు త్వరలో నెరవేరను న్నాయి. ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 12,649 ఉద్యోగాలు భర్తీ చేసింది. ఏఎన్ఎంల భర్తీతో రేవంత్ సర్కార్ భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య 14,580కి చేరుతుంది.

# తెలంగాణ హండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా దూడం వెంకటరమణ

- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర సీఎస్ రామకృష్ణరావు
- కాంగ్రెస్ యువ నేత కు అరుదైన గౌరవం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ యువ నేత, టీపీసీసీ అధికార ప్రతినిధి దూడం వెంకట రమణకు అరుదైన గౌరవం లభించింది. సుదీర్ఘ కాలం పార్టీలో వివిధ విభాగాల్లో సేవలు అందించిన ఆయనకు... తెలంగాణ రాష్ట్ర హండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా బుధవారం నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఉత్త ర్వులు విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ, ప్రజా సమస్యలపై స్పందించినందుకు ఈ గుర్తింపు లభించిందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేశాయి. అయితే, ఈ సందర్భంగా దూడం వెంకట రమణ మాట్లాడుతూ... ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితర పార్టీ పెద్దలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# పోలీస్ అధికారినే ఆటపట్టించిన పోకిరీలు

**హైదరాబాద్, మే6 (జనంసాక్షి) :** ఆమె ఓ పోలీస్ ఉన్నతాధికారి. ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు స్వయంగా తానే రంగంలోకి దిగింది. ఆవిడే మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి. ఇటీవలే మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం అర్ధరాత్రి కీలక ఆపరేషన్ చేపట్టి సీపీగా కాకుండా సగటు మహిళగా బస్టాండ్‌లో ఒంటిరిగా నిలబడింది. దీంతో అక్కడ ఉన్నది సీపీ సుమతి అని తెలియక సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరి రకరకాల ప్రశ్నలతో వేధించారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో సీపీ సాధారణ మహిళలు పడే ఇబ్బందులను తాను ఎదుర్కొన్నారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు.


# కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలి

- 'మంత్రి సీతక్క డిమాండ్
- రాహుల్, రేవంత్‌లపై వ్యాఖ్యలు సిగ్గుచేటు



**హైదరాబాద్, మే 6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు. వరంగల్ వేదికగా కెటిఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజానికి రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణమాఫీ జరగలేదు. నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు. ఫామ్ హౌస్ పాలనలో రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి పనిచేస్తోంది. ప్రజల్లో తిరుగుతున్నాం.. ఫారిన్ టూర్లలో కాదు. సమ్మక్క-సారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారు. కమిషన్ల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి. లేకుంటే అదే ప్రజలు బుద్ధి చెప్తారు' అని సీతక్క వెల్లడించారు.

# పాపికొండలు యాత్రకు తాత్కాలిక బ్రేక్



**రాజమండ్రి, మే6 (జనంసాక్షి) :** రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు సూచన చేశారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండలు విహారయాత్ర' ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండలు యాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతనే విహారయాత్రను పునరుద్ధరి స్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# బాలుడిపై హత్యాచారం

## యూపిలో దారుణ ఘటన

- దుండగుడిని కాల్చి చంపిన పోలీసులు

**లక్నో, మే6 (జనంసాక్షి) :** ఓ కామాంధుడిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. మంగళవారం నాడు హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం చేశాడు. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. అయితే, హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. ఈ సందర్భంగా మెహనూర్ ఏకంగా పోలీసులపైకే కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరపగా.. మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అతని మృతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు. నిందితుడిని కన్నౌజ్ జిల్లావాసిగా గుర్తించినట్లు చెప్పారు. అతనికి నేర చరిత్ర ఉందని.. పలు జిల్లాల్లో దాదాపు పన్నెండు కేసులు మెహనూర్‌పై నమోదైనట్లు ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.

# రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- 17వ ఎస్ఐపీబీ సమావేశంలో చంద్రబాబు

**అమరావతి, మే6 (జనంసాక్షి) :** రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 17వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు 39 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. విశాఖపట్నంలో రిలయన్స్ సంస్థ రూ.1 లక్ష కోట్లతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. కడపలో అదానీ సంస్థ రూ.12 వేల కోట్లతో హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును చేపట్టనుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టులకు నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370